ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts
సంపుటి - 02 సంచిక -324 పేజీలు - 8 వెల - 03/- బుధవారం 11 మార్చి 2026

# చైనా పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్



**ఎఫ్‌డీఐపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం**
**చైనా సహా సరిహద్దు దేశాల నుంచి సడలింపు**
**నిబంధనల సవరణకు కేబినెట్ ఆమోదం**

**న్యూఢిల్లీ,మార్చి 10, (రిపబ్లిక్ న్యూస్)**
విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌తో సరిహద్దు పంచుకునే దేశాల నుంచి వచ్చే విదేశీ ప్రత్యేక్ష పెట్టుబడులపై అమల్లో ఉన్న నిబంధనలను కేంద్రం కొంతవరకు సడలించింది. మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ నిర్ణయంతో చైనా సహా పలు పొరుగు దేశాల పెట్టుబడులపై అమల్లో ఉన్న కొన్ని పరిమితులు సవరించారు. 2020లో అమల్లోకి తీసుకువచ్చిన ప్రెస్ నోట్--3 నిబంధనల్లో కేంద్రం మార్పులు చేసింది. **మిగతా 2లో...**

## దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాలకు పెద్దపీట

**ఏకంగా రూ. 8.8 లక్షల కోట్లతో ఆరు భారీ ప్రాజెక్టులు**
**జల్ జీవన్ మిషన్ పొడిపునకు మరో రూ.8.7 లక్షల కోట్ల**
**అంతర్జాతీయ విమానాశ్రయంగా మధురై ఎయిర్‌పోర్టు**
**రూ.2,905 కోట్లతో సంత్రాగచ్చి-ఖరగ్‌పూర్ ఫోర్‌లేన్ రోడ్డు**
**రూ.3,839 కోట్లతో బద్నావర్-థాండియామధ్య 5 లైన్ల రహదారి**
**కేంద్ర కేబినేట్ వివరాలు వెల్లడించిన కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్**


2లో.

# బీచ్ సాండ్ మినరల్స్‌పై ప్రత్యేక దృష్టి

**'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్'గా ఏపీ: సీఎం చంద్రబాబు**
**ఏపీ టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్ ఏర్పాటుకు సన్నాహాలు**
**రాబోయే పదేళ్లలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు, 40 వేల ఉద్యోగాలే టార్గెట్**
**శ్రీకాకుళం, అనకాపల్లి, మచిలీపట్నంలో 3 ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదన**

**అమరావతి,మార్చి 10, (రిపబ్లిక్ న్యూస్)**
ఆంధ్రప్రదేశ్‌ను 'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్'గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకు రాష్ట్ర తీరప్రాంతంలో లభించే విలువైన బీచ్ సాండ్ వంటి ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. తద్వారా రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి కొత్త ఊపునివ్వాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో గనుల శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఆంధ్రప్రదేశ్ టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్ (ఆప్టా-టూవీవీ)' ఏర్పాటు, పెట్టుబడుల ఆకర్షణ వంటి కీలక అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ మిషన్ ద్వారా రాబోయే పదేళ్లలో రూ. 50,000 కోట్ల పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు, 40,000 మందికి **మిగతా 2లో...**



# ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ విధానంపై సుప్రీంకోర్టులో విచారణ

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసిన సర్వోన్నత న్యాయస్థానం**
**రిజర్వేషన్ల ప్రయోజనాలు కొందరికే అందుతున్నాయని పిటిషన్‌లో ఆరోపణ**
**ఎస్సీ, ఎస్టీ వర్గాల్లోనే 'కులంలో కులం' ఏర్పడుతోందన్న పిటిషనర్ వాదన**

**న్యూఢిల్లీ,మార్చి 10, (రిపబ్లిక్ న్యూస్)**
షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) రిజర్వేషన్లలో 'క్రీమీలేయర్' విధానాన్ని అమలు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై సుప్రీంకోర్టు ఇవాళ విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వం, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ ఆర్. మహదేవన్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. **మిగతా 2లో...**



# ఎపిలో పెరుగుతున్న ఎండల తీవ్రత

**ముందస్తు చర్యలపై ప్రభుత్వం అప్రమత్తం**
**అధికారులతో సమీక్షించిన హోంమంత్రి అనిత**



**అమరావతి,మార్చి 10, (రిపబ్లిక్ న్యూస్)**
రాష్ట్రంలో ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతోంది. దీంతో ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. ముందస్తు చర్యలపై సమీక్షించింది. ఎండల తీవ్రత, వడగాల్పుల పరిస్థితులపై హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏపీఎస్‌డీఎంఏ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్లు, లైన్ డిపార్ట్‌మెంట్ల అధికారులు, విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు పాల్గొన్నారు. **మిగతా 2లో...**

# గ్యాస్ సంక్షోభం..

## 'ఎస్మా' ప్రయోగించిన కేంద్రం

**గృహ అవసరాలకే తొలి ప్రాధాన్యమని వెల్లడి**
**హోటళ్లకు షాక్ ఇస్తూ కేంద్రం సంచలన నిర్ణయం**
**దేశవ్యాప్తంగా పలు నగరాల్లో మూతపడనున్న హోటళ్లు!**

**న్యూఢిల్లీ,మార్చి 10, (రిపబ్లిక్ న్యూస్)**
దేశవ్యాప్తంగా ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల కొరత తీవ్రం కావడంతో కేంద్ర ప్రభుత్వం అత్యవసర చర్యలకు ఉపక్రమించింది. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో ప్రపంచ ఇంధన సరఫరాలో ఏర్పడిన అంతరాయాల కారణంగా కమర్షియల్ ఎల్‌పీజీ కొరత **మిగతా 2లో...**



# ప్రత్యేకాధికారుల పాలనలోకి మున్సిపాలిటీలు, కార్పోరేషన్లు

**ఎపి ప్రభుత్వం ఆదేశాలు జారీ**

**అమరావతి,మార్చి 10, (రిపబ్లిక్ న్యూస్)** ఏపీ వ్యాప్తంగా 11 మున్సిపల్ కార్పొరేషన్లు, 75 మున్సిపాలిటీలు, నగరపంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. 6 నెలలు లేదా ప్రజాప్రతినిధులు ఎన్నికయ్యేవరకు ప్రత్యేక అధికారులు పాలన సాగించనున్నారు. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి రానుంది. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కడప, కర్నూలు, అనంతపురం, ఒంగోలు, విజయనగరం, మచిలీపట్నం, చిత్తూరు కార్పొరేషన్లలో ప్రత్యేక అధికారుల పాలన సాగనుంది. ఈ మేరకు పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ నోటిఫికేషన్ జారీ చేశారు.

# నాలుగు కేటగిరీలుగా గ్రామ పంచాయతీలు

**ఏపీలో గ్రామ పంచాయతీల పునర్‌వర్గీకరణకు ప్రభుత్వ ఆమోదం**
**మూడు నుంచి నాలుగుకు పెరిగిన పంచాయతీల కేటగిరీలు**
**కొత్తగా 'రూర్బన్' పంచాయతీల ఏర్పాటుకు నిర్ణయం**
**జనాభా, ఆదాయాన్ని బట్టి పంచాయతీల కొత్త వర్గీకరణ**
**రూర్బన్ పంచాయతీల్లో పట్టణ స్థాయి సౌకర్యాల కల్పన**




**అమరావతి,మార్చి 10, (రిపబ్లిక్ న్యూస్)**
ఏపీలో గ్రామ పంచాయతీల స్వరూపాన్ని మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పంచాయతీల పునర్‌వర్గీకరణకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు మూడు రకాలుగా ఉన్న పంచాయతీలను, ఇకపై జనాభా, వార్షిక ఆదాయం ఆధారంగా నాలుగు కేటగిరీలుగా విభజించింది. ఇందులో భాగంగా **మిగతా 2లో...**

# ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌కు ట్రంప్ వార్నింగ్

**ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా మొజ్తబా ఖమేనీ నియామకం**
**ఈ నిర్ణయంపై తీవ్రంగా స్పందించిన డొనాల్డ్ ట్రంప్**
**"అతను ప్రశాంతంగా జీవించలేడు" అంటూ ఘాటు హెచ్చరిక**
**నియామకంలో తన ప్రమేయం ఉండాల్సిందని వ్యాఖ్య**
**పెరుగుతున్న అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు**


2లో.

# అవిశ్వాస రగడ

**లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాసం**
**జగదంబికా పాల్ ప్రత్యేక స్పీకర్‌గా విధులు**
**చర్చను ప్రారంభించిన కాంగ్రెస్ ఎంపి జావెద్**
**కాంగ్రెస్ సంప్రదాయాలు పాటించడం లేదన్న కిరణ్ రిజిజు**
**నెహ్రూను తిట్టేవారు ఆయనను జపిస్తున్నారంటూ ప్రియాంక ఎదురుదాడి**



**న్యూఢిల్లీ,మార్చి 10, (రిపబ్లిక్ న్యూస్)** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం గురించి లోక్‌సభలో చర్చ ప్రారంభమైంది. ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానాన్ని కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావెద్ లోక్‌సభలో మంగళవారం ప్రవేశపెట్టారు. అనంతరం దీనిపై చర్చ ప్రారంభమైంది. ఈ చర్చ కోసం పది గంటల సమయం కేటాయించారు. అనంతరం తీర్మానంపై ఓటింగ్ నిర్వహించనున్నారు. స్పీకర్ ఓం బిర్లా నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదని, ఆయన అధికార పార్టీ భాష మాట్లాడుతున్నారని తీర్మానాన్ని ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావెద్ ఆరోపించారు. **మిగతా 2లో...**

## ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ విధానంపై సుప్రీంకోర్టులో విచారణ

మొదటి పేజీ తరువాయి

ఇదే తరహా అభ్యర్థనతో ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న మరో పిటిషన్‌తో ఈ వ్యాజ్యాన్ని జత చేసింది. మాజీ బ్యూరోక్రాట్ జ్ఞానేంద్ర కుమార్ ఖరే ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్‌ను అమలు చేయకపోవడం ఏకపక్షమని, రాజ్యాంగ విరుద్ధమని, రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని ఉల్లంఘించడమేనని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. రిజర్వేషన్ల ప్రయోజనాలు ఎస్సీ, ఎస్టీ వర్గాల్లోని ఉన్నత వర్గాలకే పదేపదే అందుతున్నాయని, దీనివల్ల ఆ వర్గాల్లోనే 'కులంలో కులం' ఏర్పడుతోందని పిటిషనర్ వాదించారు. దీని ఫలితంగా అత్యంత వెనుకబడిన నిరుపేదలు అవకాశాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చారిత్రక అన్యాయాన్ని సరిదిద్దేందుకే రిజర్వేషన్లు ఉద్దేశించినవని, అవి శాశ్వత హక్కుగా మారకూడదని పిటిషన్‌లో తెలిపారు. ఓబీసీలకు క్రీమీలేయర్ విధానాన్ని ప్రవేశపెట్టిన ఇంద్రా సహానీ కేసు తీర్పును కూడా ఇందులో ప్రస్తావించారు. ఎస్సీ, ఎస్టీలలో ఉప వర్గీకరణ రాజ్యాంగబద్ధమేనని, వారికి క్రీమీలేయర్ వర్తింపజేయవచ్చని ఇటీవల ఓ రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును కూడా పిటిషనర్ ఉటంకించారు. రిజర్వేషన్ల ఫలాలు సమాజంలోని అత్యంత వెనుకబడిన వర్గాలకు చేరేలా చూడటానికి క్రీమీలేయర్ గుర్తింపు, మినహాయింపు కోసం ఒక యంత్రాంగాన్ని రూపొందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలని ఆయన కోరారు.

## ఎపిలో పెరుగుతున్న ఎండల తీవ్రత

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా 'హీట్ వేవ్ యాక్షన్ ఎలాన్–2026'ను హోంమంత్రి ఆవిష్కరించారు. అధికారులందరూ ఈ ఎ÷–లాన్‌ను అనుసరించి ముందుకు సాగాలని ఆదేశించారు. సెంట్రల్ ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఏపీఎస్‌డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగి వడగాల్పులు ఎక్కువగా వీచే అవకాశం ఉందని మంత్రి అనిత హెచ్చరించారు. అధికారులు నిరంతరం అప్రమత్తంగా పనిచేయాలని.. వడదెబ్బ కారణంగా ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చూడాలని హోంమంత్రి ఆదేశాలు జారీ చేశారు. పశువుల రక్షణకు సంబంధించి సూచనలు జారీ చేయాలని సూచించారు. వడదెబ్బ బారిన పడిన వారి చికిత్స కోసం బెడ్లు, మందులు, అంబులెన్సులు సిద్ధం చేయాలని వైద్యశాఖను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్లు.. ఎండ తీవ్రత జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. వృద్ధులు, పిల్లలు, బహిరంగ ప్రాంతాల్లో పనిచేసే కార్మికులపై ప్రత్యేక దృష్టి సారించాలని హోంమంత్రి తెలిపారు. నిరంతరాయంగా తాగునీటి సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను హోంమంత్రి ఆదేశించారు. తాత్కాలిక చలువ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. మార్కెట్లు, బస్టాండ్లు, కూడళ్లు వంటి జనసమూహ ప్రాంతాల్లో తప్పనిసరిగా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్జీవోలు, కమ్యూనిటీ గ్రూపుల ద్వారా మంచినీరు, మజ్జిగ వంటి పంపిణీ కార్యక్రమాలు చేపట్టాలని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత సూచించారు.

## నాలుగు కేటగిరీలుగా గ్రామ పంచాయతీలు

మొదటి పేజీ తరువాయి

పట్టణ లక్షణాలు సంతరించుకుంటున్న పెద్ద గ్రామాలను గుర్తిస్తూ కొత్తగా 'రూర్బన్' (రూరల్ + అర్బన్) పంచాయతీ కేటగిరీని ప్రవేశపెట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన పరిపాలన, పౌర సేవలు అందించడమే లక్ష్యంగా ఈ మార్పులు చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు రూపొందించిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఈ కొత్త వర్గీకరణ ప్రకారం రూర్బన్ పంచాయతీలలో పట్టణాలకు దీటుగా మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు.

**రూర్బన్ పంచాయతీ:** 10 వేలకు పైగా జనాభా, రూ.కోటి కంటే ఎక్కువ వార్షిక ఆదాయం ఉండాలి. గిరిజన ప్రాంతాల్లో అయితే 5 వేలకు పైగా జనాభా ఉంటే సరిపోతుంది. ఈ పంచాయతీలలో పట్టణ తరహా సౌకర్యాలు కల్పిస్తారు.

**గ్రేడ్–1 పంచాయతీ:** 3 వేల నుంచి 10 వేల మధ్య జనాభా, రూ.30 లక్షల నుంచి రూ.కోటి లోపు వార్షిక ఆదాయం ఉండాలి. గిరిజన ప్రాంతాల్లో 2,500 నుంచి 5 వేల మధ్య జనాభా ఉండాలి. మండల కేంద్రంగా ఉన్న పంచాయతీలు ఈ గ్రేడ్ కిందికి వస్తాయి.

**గ్రేడ్–2 పంచాయతీ:** 2 వేల లోపు జనాభా ఉండాలి. గిరిజన ప్రాంతాల్లో జనాభా 1,500 నుంచి 2 వేల మధ్య ఉండాలి.

**గ్రేడ్–3 పంచాయతీ:** 1,500 కంటే తక్కువ జనాభా ఉన్న పంచాయతీలను ఈ కేటగిరీలో చేర్చారు.

ఈ నూతన వర్గీకరణతో పంచాయతీలకు వాటి జనాభా, ఆదాయ వనరులకు అనుగుణంగా నిధుల కేటాయింపు, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన సులభతరం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పెద్ద గ్రామాల్లో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా సేవలు అందించేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

## ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌కు ట్రంప్ వార్నింగ్

న్యూఢిల్లీ,**మార్చి 10, (రిపబ్లిక్ న్యూస్)**

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తారస్థాయికి చేరాయి. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా ఎంపికైన మొజ్తబా ఖమేనీని లక్ష్యంగా చేసుకుని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. "అతను ప్రశాంతంగా జీవించగలడని నేను అనుకోవడం లేదు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మృతి తర్వాత ఆయన కుమారుడైన 56 ఏళ్ల మొజ్తబా ఖమేనీని కొత్త అధినేతగా ఎన్నుకున్నారు. ఈ నిర్ణయంపై ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఇరాన్ ఈ నాయకుడిని ఎన్నుకోవడంపై నేను సంతోషంగా లేను. అతను ప్రశాంతంగా బతకలేడు" అని స్పష్టం చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్ నియామక ప్రక్రియలో వెనెజువెలా తరహాలోనే తన ప్రమేయం కలిగి ఉండాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు. అంతేకాదు, ఖమేనీ విధానాలు గత పాలకుల మాదిరే కొనసాగితే ఐదేళ్లలో మరో యుద్ధం తప్పదని ట్రంప్ హెచ్చరించారు. "ఆ పదవిలో కొనసాగాలంటే అతను మా అనుమతి తీసుకోవాలి. లేకపోతే ఎక్కువ కాలం ఉండలేడు" అని ఓ ఇంటర్వ్యూలో ట్రంప్ వ్యాఖ్యానించారు.

# గ్యాస్ సంక్షోభం..'ఎస్మా' ప్రయోగించిన కేంద్రం

మొదటి పేజీ తరువాయి

ఏర్పడింది. దీంతో వంట గ్యాస్ క్రమబద్ధమైన సరఫరాను నిర్ధారించడానికి కేంద్ర ప్రభుత్వం 'నిత్యావసర వస్తువుల చట్టం' (ఎస్మా)ను ప్రయోగించింది. పశ్చిమాసియాలోని కీలక ఇంధన రవాణా మార్గాల్లో తలెత్తిన ఆటంకాల ఫలితంగా.. బెంగళూరు, ముంబై, చెన్నై వంటి ప్రధాన నగరాల్లోని హాస్పిటాలిటీ రంగం ఇప్పుడు అకస్మాత్తుగా కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ల కొరతను ఎదుర్కొంటోంది. సరఫరా పునరుద్ధరించకపోతే కొన్ని రోజుల్లోనే హోటళ్లు మూతపడవచ్చని రెస్టారెంట్ అసోసియేషన్లు హెచ్చరిస్తున్నాయి.

### ఏమిటీ 'ఎస్మా' ఆర్డర్?

పెట్రోలియం మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆదేశాల ప్రకారం.. దేశంలోని అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఆయిల్ రిఫైనరీలపై ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించింది. రిఫైనరీల్లో ఉత్పత్తి అయ్యే ప్రొపేన్, బ్యూటేన్ గ్యాస్ నిల్వలను కేవలం వంట గ్యాస్ తయారీకే వాడాలని, పెట్రోకెమికల్స్ తయారీకి మళ్లించకూడదని ప్రభుత్వం ఆదేశించింది. ఉత్పత్తి అయిన మొత్తం గ్యాస్‌ను కేవలం ప్రభుత్వ రంగ సంస్థలైన ఐఓసీ, బీపీసీఎల్, హెచ్ పీసీఎల్‌లకు మాత్రమే విక్రయించాలని స్పష్టం చేసింది. ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే ఎస్మా చట్టం కింద క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

### హోటళ్లు, రెస్టారెంట్లపై 'సిలిండర్' బాంబు!

గృహ అవసరాలకు ప్రాధాన్యమిస్తూ కమర్షియల్ గ్యాస్ సరఫరాపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. దీనివల్ల బెంగళూరు, చెన్నై, ముంబై వంటి నగరాల్లో కమర్షియల్ సిలిండర్ల సరఫరా నిలిచిపోవడంతో వందలాది హోటళ్లు మూతపడే స్థితికి చేరుకున్నాయి. దీంతో హోటళ్లను కూడా అత్యవసర సేవలుగా గుర్తించి గ్యాస్ సరఫరాను పునరుద్ధరించాలని హోటళ్ల అసోసియేషన్ వారు కోరుతున్నారు. దీనికి తోడు మార్చి 7 నుంచి గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర రూ.60, కమర్షియల్ సిలిండర్ ధర రూ.115 పెరగడం గోరుచుట్టుపై రోకలిపోటులా మారింది.

### హర్దీప్ పూరీ భరోసా..

కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ మాట్లాడుతూ.. దేశంలో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందవద్దని కోరారు. యుద్ధ ప్రభావిత ప్రాంతాల నుంచి కాకుండా, అమెరికా నుంచి దాదాపు 2.2 మిలియన్ టన్నుల గ్యాస్‌ను దిగుమతి చేసుకునేందుకు చారిత్రాత్మక ఒప్పందం కుదుర్చుకున్నామని, ఆ నిల్వలు ఇప్పటికే రావడం ప్రారంభించాయని ఆయన వెల్లడించారు.

# బీచ్ సాండ్ మినరల్స్‌పై ప్రత్యేక దృష్టి

మొదటి పేజీ తరువాయి

ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం వనరులను వెలికితీయడమే కాకుండా, వాటికి విలువ జోడించడం (వాల్యూ ఎడిషన్)పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రేర్ మినరల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్రంలోని వనరులపై పూర్తి అవగాహన పెంచుకోవడంతో పాటు, భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా, రాష్ట్రంలోని తీరప్రాంతంలో లభించే బీచ్ సాండ్ మినరల్స్ దేశంలోనే అత్యంత విలువైనవని అధికారులు సీఎంకు వివరించారు. వీటిలో ప్రధానంగా ఇల్మెనైట్, రుటైల్, జిర్కాన్, మోనాజైట్, గార్నెట్, సిల్లిమనైట్ వంటి వ్యూహాత్మక ప్రాధాన్యమున్న ఖనిజాలు ఉన్నట్లు తెలిపారు. ఈ బీచ్ సాండ్ మినరల్స్ నుంచి వచ్చే ఉత్పత్తులు పెయింట్స్, కాస్మెటిక్స్, ఫార్మా రంగాలతో పాటు ఏరోస్పేస్, రక్షణ, శస్త్రచికిత్స పరికరాలు, సెరామిక్స్, ఎలక్ట్రానిక్స్, అణు ఇంధనం, అణు రియాక్టర్ల విడిభాగాల తయారీ వంటి అత్యంత కీలకమైన పరిశ్రమలకు అవసరమని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించుకునేందుకు రాష్ట్రంలో మూడు ముఖ్యమైన ప్రాసెసింగ్ పార్కులను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. శ్రీకాకుళంలో టైటానియం పార్క్ (ఏడాదికి 15 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం), అనకాపల్లిలో రేర్ ఎర్త్ కారిడార్ (ఏడాదికి 25,000 టన్నుల ఉత్పత్తి లక్ష్యం), మచిలీపట్నంలో సమగ్ర టైటానియం, రేర్ ఎర్త్ కారిడార్‌లను ఏర్పాటు చేయాలని తమ ప్రతిపాదనలను సీఎం ముందుంచారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, గనులు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### 11, 12 తేదీల్లో కలెక్టర్ల కాన్ఫరెన్స్

రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలును వేగవంతం చేసే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక సమావేశానికి సిద్ధమయ్యారు. ఈ నెల 11, 12 తేదీల్లో రెండు రోజుల పాటు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి సమీక్షలు జరిపి, పరిపాలన యంత్రాంగానికి స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు. సచివాలయంలోని ఐదో బ్లాకులో జరిగే ఈ సదస్సు మొదటి రోజు ఉదయం 10 గంటలకు సీసీఎల్ఏ స్వాగత ప్రసంగంతో మొదలవుతుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉప ముఖ్యమంత్రి, మంత్రుల ప్రసంగాల అనంతరం ఉదయం 10:30 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలకోపన్యాసం చేస్తారు. అనంతరం "స్వర్ణాంధ్ర ఏ2047" విజన్‌లో భాగంగా నిర్దేశించుకున్న పది సూత్రాల అమలుపై చర్చిస్తారు. పేదరిక నిర్మూలన, జల భద్రత, వ్యవసాయంలో సాంకేతికత వినియోగం వంటి అంశాలపై సమీక్షిస్తారు. రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధి రేటు, జిల్లాల వారీగా సాధించిన ప్రగతిపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటారు. డిజిటల్ గవర్నెన్స్‌లో భాగంగా ఈ–ఆఫీస్ ఫైళ్ల సత్వర పరిష్కారం, పెట్టుబడుల ఆకర్షణ వంటి అంశాలపై అధికారులకు మార్గనిర్దేశం చేస్తారు.

# అవిశ్వాస రగడ



మొదటి పేజీ తరువాయి

అనంతరం అవిశ్వాస తీర్మానంపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు చర్చను ప్రారంభించారు. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం గురించి చర్చ జరుగుతున్న సమయంలో సభను నడిపేందుకు ప్రత్యేక సభాపతిని నియమించాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ డిమాండ్‌కు కేంద్రం అంగీకరించింది. సీనియర్ ఎంపీ, చైర్ పర్సన్స్ ప్యానెల్ సభ్యుడు జగదాంబికా పాల్‌ను నియమించింది. ఆయన నేతృత్వంలో ప్రస్తుతం స్పీకర్ ఓం బిర్లా అవిశ్వాస తీర్మానంపై చర్చ చేపట్టారు. ప్రతిపక్షాల తరపున కాంగ్రెస్ ఎంపి గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ.. భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం సహా పలు అంశాలపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి మాట్లాడేందుకు యత్నించారని, కానీ స్పీకర్ అనుమతినివ్వలేదని అన్నారు. ప్రతిపక్ష ఇండియా కూటమికి లోక్‌సభలో సుమారు 200మంది సభ్యులున్నప్పటికీ.. డిప్యూటీ స్పీకర్ లేరని అన్నారు. డిప్యూటీ స్పీకర్ లేకుండా సభ ఎలా నడుస్తుందో దేశ ప్రజలు చూడాలని అన్నారు. మైక్‌ని కూడా ఆయుధంగా వినియోగి స్తున్నారని అన్నారు. ఎన్‌డిఎ సభ్యులకు మాట్లాడేందుకు అనుమతినిస్తున్నారని, కానీ ప్రతిపక్షాలకు మాట్లాడేందుకు మైక్‌ని ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని అన్నారు. అయితే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సభలో హుందాగా మెలగడం లేదని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. ఈ క్రమంలో గతంలో ప్రధాని మోదీని రాహుల్ ఆలింగనం చేసుకున్న ఘటనను ప్రస్తావించారు. ప్రధాని మోదీ దగ్గరకు వచ్చిన రాహుల్.. ఆలింగనం చేసుకొని వెళ్లి తన సీట్లో కూర్చున్నారు. అనంతరం తోటి ఎంపీలను చూసుకుంటూ కళ్లు ఎగరవేశారు. అటువంటి నేతను ఎప్పుడూ చూడలేదు' అని కిరణ్ రిజిజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గతంలో నెహ్రూ చెప్పిన నాటి స్పీకర్ జీవీ మావలాంకర్‌ను సమర్థిస్తూ మాటలను గుర్తుంచుకోవాలని కాంగ్రెస్ నేతలకు సూచించారు. దీనిపై దీటుగా స్పందించిన ప్రియాంకా గాంధీ.. ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. రిజిజు విమర్శలను ఎంపీ ప్రియాంకా గాంధీ తిప్పికొట్టారు. విపక్ష నేత రాహుల్ గాంధీ చెప్పే విషయాలను అధికార పక్షం జీర్ణించుకోలేక పోతోందన్నారు. గడిచిన 12 ఏళ్లలో ప్రభుత్వానికి దీటుగా నిలిచిన వ్యక్తి రాహుల్ ఒక్కరేనని అన్నారు. నెహ్రూను ఎప్పుడూ విమర్శించే వాళ్లు అకస్మాత్తుగా ఆయన్ను ప్రశంసించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అందుకే తనకు నవ్వు వస్తోందన్నారు. నిరంతరం నెహ్రూను ఆడిపోసుకుంటున్న వారు ఆయన గురించి మాట్లాడంతో నవ్వు ఆపుకోలేక పోయానని అన్నారు. అయితే, ప్రధాని మోదీ, రాహుల్ గాంధీ సభలో లేని సమయంలో ఈ చర్చ జరిగింది. ఆ సమయంలో స్పీకర్ స్థానంలో టిడిపికి చెందిన తెన్నేటి కృష్ణప్రసాద్ ఉన్నారు.

# చైనా పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్

మొదటి పేజీ తరువాయి

ఈ నిబంధన ప్రకారం భారత్‌తో భూసరిహద్దు ఉన్న దేశాలకు చెందిన కంపెనీలు లేదా ఆ దేశాల షేర్ హోల్డర్లు ఉన్న సంస్థలు భారత్‌లో ఏ రంగంలోనైనా పెట్టుబడి పెట్టాలంటే తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ నిబంధనల్లో కొంత సడలింపు కల్పించినట్లు వర్గాలు చెబుతున్నాయి. భారత్‌తో భూసరిహద్దు పంచుకునే దేశాల్లో చైనా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, భూటాన్, నేపాల్, మయన్మార్, అఫ్గానిస్థాన్? ఉన్నాయి. ఈ దేశాల నుంచి వచ్చే పెట్టుబడులు ఇప్పటివరకు కఠిన నియంత్రణల కిందనే కొనసాగుతున్నాయి. 2020 జూన్‌లో లద్ధాఖ్?లోని గల్వాన్ లోయ వద్ద భారత్ చైనా సైన్యాల మధ్య జరిగిన ఘర్షణ తర్వాత రెండు దేశాల మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ సంఘటన తర్వాతే కేంద్రం ప్రెస్ నోట్––3ను అమల్లోకి తెచ్చింది. దీని ద్వారా చైనా కంపెనీలు భారతీయ కంపెనీల్లో పెట్టుబడులు పెంచడాన్ని కట్టడి చేయాలని ప్రయత్నించింది. అదే సమయంలో డేటా భద్రత, జాతీయ భద్రత కారణాల నేపథ్యంలో కేంద్రం 200కు పైగా చైనా మొబైల్ యాప్‌లను నిషేధించింది. వాటిలో ప్రముఖంగా టిక్ టాక్, ఉయ్ చాట్?, యూసీ బ్రౌజర్ ఉన్నాయి. భారత్‌లో మొత్తం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో చైనా వాటా చాలా తక్కువగా ఉందని అధికారిక గణాంకాలు సూచిస్తున్నాయి. 2000 ఏప్రిల్ నుంచి 2025 డిసెంబర్ వరకు వచ్చిన మొత్తం ఎఫ్‌డీఐలో చైనా వాటా కేవలం 0.32 శాతం మాత్రమే. విలువ పరంగా ఇది సుమారు 2.51 బిలియన్ అమెరికన్ డాలర్లుగా నమోదైంది. ఈ కారణంగా ఎఫ్‌డీఐ పరంగా చైనా భారత్‌లో 23వ స్థానంలో ఉంది. ఎఫ్‌డీఐ పరంగా చైనా వాటా తక్కువగా ఉన్నప్పటికీ, రెండు దేశాల మధ్య వాణిజ్యం మాత్రం వేగంగా పెరిగింది. ప్రస్తుతం చైనా భారత్‌కు రెండో అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా కొనసాగుతోంది. 2024– 25 ఆర్థిక సంవత్సరంలో చైనాకు భారత్ నుంచి ఎగుమతులు 14.5 శాతం తగ్గి 14.25 బిలియన్ డాలర్లకు చేరాయి. గత సంవత్సరం ఇది 16.66 బిలియన్ డాలర్లుగా నమోదైంది. అదే సమయంలో చైనా నుంచి భారత్‌కు దిగుమతులు 11.52 శాతం పెరిగి 113.45 బిలియన్ డాలర్లకు చేరాయి. గత ఏడాది ఇది 101.73 బిలియన్ డాలర్లుగా ఉంది. దీంతో రెండు దేశాల మధ్య వాణిజ్య లోటు భారీగా పెరిగింది. 2023––24లో 85 బిలియన్ డాలర్లుగా ఉన్న ట్రేడ్ డెఫిసిట్ 2024––25లో 99.2 బిలియన్ డాలర్లకు చేరింది. అయితే 2025– 26 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జనవరి వరకు భారత్ నుంచి చైనాకు ఎగుమతులు 38.37 శాతం పెరిగి 15.88 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇదే కాలంలో దిగుమతులు 13.82 శాతం పెరిగి 108.18 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఈ కాలానికి ట్రేడ్ డెఫిసిట్ సుమారు 92.3 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇదే కేబినెట్ సమావేశంలో కేంద్రం మరో కీలక నిర్ణయం కూడా తీసుకుంది. కంపెనీల నిర్వహణ, దివాలా ప్రక్రియలకు సంబంధించిన చట్టాల్లో మార్పులకు ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించిన సవరణలను ఇన్ సాల్వెన్సీ, దివాలా కోడ్, కంపెనీల చట్టం, 2013లో చేయనున్నట్లు సమాచారం. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న ఈ రెండు చట్టాల్లో పలు మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా దివాలా పరిష్కార ప్రక్రియలకు పట్టే సమయాన్ని తగ్గించే విధంగా మార్పులు ప్రతిపాదించినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన బిల్లును గత ఏడాది ఆగస్టులో లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం దీనిని లోక్‌సభ సెలెక్ట్ కమిటీకి పంపించారు. ఆ కమిటీ 2025 డిసెంబర్‌లో తన నివేదికను సమర్పించింది. ఇటీవల కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి నిర్మలా సీతారామన్ కూడా ఐబీసీ సవరణ బిల్లును బడ్జెట్ సమావేశాల రెండో భాగంలో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిపారు. ఈ మార్పుల ద్వారా పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచడం, కంపెనీలకు వ్యాపార వాతావరణాన్ని మరింత సులభతరం చేయడం కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

## దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాలకు పెద్దపీట


**కేంద్ర కేబినేట్ వివరాలు వెల్లడించిన కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్**

ప్రధాని మోడీ అధ్యక్షతన మంగళవారం జరిగిన కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ ఏకంగా రూ. 8.8 లక్షల కోట్ల విలువైన ఆరు భారీ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఇక జల్ జీవన్ మిషన్ పొడింపు కోసం మరో రూ.8.7 లక్షల కోట్లను కేటాయించింది. ముధురై ఎయిర్‌పోర్టును అంతర్జాతీయ విమానాశ్రయంగా ప్రకటించేందుకు కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక సంత్రాగచ్చి–ఖరగ్‌పూర్ మధ్య రూ.2,905 కోట్లతో నాలుగు లైన్ల రహదారి, రూ.3,839 కోట్లతో బద్నావర్–థాండియా–తిమర్వానీ మధ్య 5 లైన్ల రహదారి నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపింది. రూ.3,631 కోట్లతో జెవార్ విమానాశ్రయం–ఫరీదాబాద్ సెక్షన్‌ను కలిపే 6 లైన్ల ఎలివేటెడ్ రోడ్డు నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న ఈ నిర్ణయాలు దేశ ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించడమే కాకుండా, సామాన్యుల జీవన ప్రమాణాలను గణనీయంగా పెంచనున్నాయి. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ వివరాలను మీడియాకు వెల్లడిస్తూ, ప్రభుత్వం చేపడుతున్న ఈ సంస్కరణలు భవిష్యత్ భారత్ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కేబినెట్ భేటీలో అత్యంత కీలకమైన నిర్ణయం 'జల జీవన్ మిషన్ 2.0' ప్రారంభం. దీని కోసం ప్రభుత్వం సుమారు రూ. 8.7 లక్షల కోట్లను కేటాయించింది. 2019లో ప్రారంభమైన మొదటి దశలో ఇప్పటికే 81 శాతం గ్రామీణ గృహాలకు కుళాయి కనెక్షన్లు అందగా, ఇప్పుడు రెండో దశ ద్వారా మిగిలిన ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే కాకుండా, మౌలిక సదుపాయాల బలోపేతంపై దృష్టి సారించనున్నారు. అదనంగా లక్షల కోట్ల రూపాయల కేంద్ర సాయాన్ని పెంచడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నీటి ఎద్దడిని శాశ్వతంగా పరిష్కరించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. తమిళనాడులోని ఆధ్యాత్మిక, చారిత్రక నగరమైన మధురైకి కేంద్రం అంతర్జాతీయ స్థాయి గుర్తింపునిచ్చింది. మధురై విమానాశ్రయాన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా ప్రకటిస్తూ తీసుకున్న నిర్ణయం దక్షిణ తమిళనాడు అభివృద్ధికి సరికొత్త రెక్కలు తొడిగింది. దీనివల్ల మీనాక్షి అమ్మన్ ఆలయం, రామేశ్వరం వంటి పుణ్యక్షేత్రాలకు వచ్చే విదేశీ పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది. అంతేకాకుండా, మధురై చుట్టుపక్కల ఉన్న పారిశ్రామిక, విద్యా , వైద్య హబ్‌లకు అంతర్జాతీయ స్థాయి అనుసంధానం లభించి, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. ÷శవ్యాప్తంగా రైళ్ల రద్దీని తగ్గించి, రవాణా సామర్థ్యాన్ని పెంచేందుకు రూ. 4,474 కోట్ల వ్యయంతో రెండు ప్రధాన రైల్వే ప్రాజెక్టులను ప్రభుత్వం ఆమోదించింది. పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాల్లోని సాయింతియా–పాకూర్ , సంత్రాగచి–ఖరగ్‌పూర్ విభాగాల్లో నాలుగో రైల్వే లైన్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ లభించింది. ఈ అదనపు లైన్ల వల్ల కేవలం ప్రయాణికులకు మాత్రమే కాకుండా, బొగ్గు , ఇతర సరుకు రవాణా కూడా వేగవంతం కానుంది. ఇది భారతీయ రైల్వేల నిర్వహణ సామర్థ్యాన్ని పెంచడంలో ఒక మైలురాయిగా నిలవనుంది. రవాణా రంగాన్ని బలోపేతం చేసే క్రమంలో మధ్యప్రదేశ్‌లో కొత్తగా ఫోర్ లేన్ కారిడార్ నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఎన్‌హెచ్–752డి పరిధిలో బద్నావర్ నుండి తిమర్వానీ వరకు 80 కిలోమీటర్ల మేర నిర్మించబోయే ఈ రహదారి ఉజ్జయిని నగరాన్ని ఢిల్లీ–ముంబై ఎక్స్‌ప్రెస్‌వేతో నేరుగా అనుసంధానిస్తుంది. దీనితో పాటు, ఉత్తరప్రదేశ్‌లోని జేవార్ విమానాశ్రయాన్ని ఫరీదాబాద్‌తో కలిపే ఎలివేటెడ్ రోడ్డు ప్రాజెక్టును కూడా ఆమోదించారు. ఈ నిర్ణయాలన్నీ కలిపి దేశంలోని వివిధ ప్రాంతాల మధ్య ప్రయాణ సమయాన్ని తగ్గించడమే కాకుండా ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేస్తాయని అశ్వినీ వైష్ణవ్ అన్నారు.

# రోడ్డు ప్రమాదాలకు నెలువుగా మారిన ఫ్లెక్సీలు..

**- పెద్ద పెద్ద హోల్డింగ్ లతో ఎదురొస్తున్న వాహనాలు కనిపించడం లేదని వాహన చోదకులు ఆందోళన..**

**ఏపీ బ్యూరో, మార్చి 10 - (రిపబ్లిక్ న్యూస్) -**
మదనపల్లి :- ఆర్ అండ్ బి అధికారుల అలసత్వమా. లేక రాజకీయ నాయకుల పబ్లిసిటీ కోసం హోల్డింగ్ లకు స్థావరమా. అది కాదన్నట్టు ప్రైవేట్ వ్యక్తులకు తొత్తా అన్నట్టుంది. ఈ తీరు చూస్తుంటే ఎవర్ని విమర్శించాలి. ఎవరిపై చర్య తీసుకోమనాలో అర్థం కాలేని పరిస్థితి దాపురించింది. ముందే ఈ రహదారి ప్రమాదాలకు పెట్టింది పేరు. ఈ ప్రాంతంలో గతంలో ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఎంతో మంది బలైపోయారు. ఎంతోమంది గాయపడ్డారు. కానీ ఆర్ అండ్ బి అధికారులకు ఇలాంటివి కనిపించటం లేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్ అండ్ బి అధికారులు కాసులకు మరిగి చోద్యం చూస్తున్నారేమో. విషయానికొస్తే రాష్ట్రంలోని ఆంధ్ర ఊటీగా పిలవబడుతున్న హార్సిలీ హిల్స్ కు వెళ్లే దారి. అందులోనూ ఎన్ హెచ్ 42 జాతీయ రహదారి. నిత్యం వేలాది వాహనాలు ఈ మార్గం గుండా సంచరిస్తుంటాయి. కాండ్ల మడుగు క్రాస్ లో మూడు రోడ్ల కూడలి వద్ద ఓ అడ్వర్ టైజ్మెంట్ హోర్డింగ్ మరియు ఫ్లెక్సీల వల్ల ఏ క్షణంలో అయినా ఎటు వైపు నుంచైన ప్రమాదం సంభవించేందుకు నిలువుగా మారింది.




**జాతీయ రహదారిపై ప్రమాదకరంగా ఫ్లెక్సీలు..**

బి. కొత్తకోట మండల కేంద్రమైన కాండ్లమడుగు క్రాస్ వద్ద సర్కిల్లో ఇష్టానుసారంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఫ్లెక్సీ ల వల్ల అటుగా వస్తున్న వాహనాలు కనబడటం లేదని ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని సంబంధిత అధికారుల పై వాహనదారులు, స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే కానీ అధికారులకు ఇలాంటివి కనిపించవని వాహనదారులు ప్రశ్నిస్తూ ప్రమాదం జరిగినప్పుడు మాత్రం పెద్ద హడావిడి చేస్తారు. తర్వాత ఒక వారం పాటు అధికారుల సందడి చేస్తారు. వాహనాల తనిఖీలు డ్రంక్ అండ్ డ్రైవ్ ఇలాంటివి చేస్తారు. తర్వాత యధాస్థితేనని వాహనా దారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కళ్ళు తెరిచి మున్ముందు ప్రమాదాలు జరగకుండా నిలువుగా ఉన్న ఫ్లెక్సీలను తొలగించాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు..

# విభిన్న ప్రతిభావంతుల అవసరాల గుర్తింపు సదస్సులు



**ఓబులవారిపల్లి మార్చి 10 రిపబ్లిక్ న్యూస్.**
రైల్వే కోడూరు నియోజకవర్గంలోని విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ అవయవ అవసరాల గుర్తింపు సదస్సులు నిర్వహిస్తున్నట్లు వివిధ ప్రతిభావంతుల సంఘం అధ్యక్షుడు మల్లు సుబ్బ నర్సారెడ్డి తెలియజేశారు ఈ సదస్సులు భారత ప్రభుత్వ న్యాయ సాధికారక మంత్రిత్వ శాఖ సౌజన్యంతో కృత్రిమ అవయవాల తయారీ సంస్థ ఆలింకో ద్వారా తిరుపతి జిల్లా సహాయ సంచాలకులు నిర్వహించబోయే సదస్సులో పాల్గొని అవసరమైన కృత్రిమ అవయవం నమోదు చేసుకోవాలని మల్లు సుబ్బ నర్సారెడ్డి తెలియజేశారు, మార్చి 14వ తేదీ శనివారం రైల్వేకోడూరు, ఓబులవారిపల్లి పుల్లంపేట మండలాలకు చెందిన కృత్రిమ అవయవ అవసరమన్న వివిధ ప్రతిభావంతులు రైల్వే కోడూరులోని హేడ్రి మేయర్ మెమోరియల్ హై స్కూల్ పాఠశాలల యందు నిర్వహించే సదస్సులో నమోదు చేసుకోవలసినదిగా ఆయన కోరారు అలాగే చిట్వేలి పెనగలూరు మండలాలకు చెందిన కృత్రిమ అవయవ అవసరం ఉన్న వివిధ ప్రతిభావంతులు చిట్వేలి టౌన్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే సదస్సులో పాల్గొని కావలసిన కృత్రిమ అవయవం నమోదు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోని వివిధ ప్రతిభావంతులు కృత్రిమ అవయవాల అవసరమున్న వ్యక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన మనవి చేశారు

# ప్రోటోకాల్ పాటించని అధికారులపై పిర్యాదు

**మల్లాపూర్ మార్చి 10 (రిపబ్లిక్ న్యూస్)**
మల్లాపూర్ మండల కేంద్రంలో వివోఎ భవనాల నిర్మాణ పనులకి రెండు సార్లు భూమి పూజా చేసి అధికారులు ప్రోటోకాల్ ఉల్లంఘించారని బీఆర్ఎస్ నాయకులు తహశీల్దారుకు పిర్యాదు చేసారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల ఆరవ తేదినాడు అధికారులతో కలిసి ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వివోఏ భవనాలకు భూమిపూజ నిర్వహించగ, మళ్ళీ ఇదే పనులకు ఈనెల తొమ్మిదో తేదినాడు కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు అధికారులతో కలిసి భూమిపూజ చేశారన్నారు. ఈ కార్యక్రమం ఎలాంటి ప్రోటోకాల్ పాటించకుండా నిర్వహించడం సరికాదని పేర్కొన్నారు. కొందరు అధికారులైతే కాంగ్రెస్ పార్టీ గల్లీ లీడర్లు కూడా ఏది చెబితే అది చేస్తూ ప్రభుత్వ నిబంధనలను





ఉల్లంఘిస్తున్నారని వాపోయారు. ఈ వ్యవహారంపై పై అధికారులు విచారణ చేపట్టి ప్రోటోకాల్ నిభందనలు ఉల్లంఘించిన అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సూచన మేరకు జిల్లా కలెక్టర్ కు, రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో... బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు,రాఘవపేట్ సర్పంచ్ తోట శ్రీనివాస్, మల్లాపూర్ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, రేగుంట సర్పంచ్ తీట్ల లహరి రాజేష్, మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, దేవ మల్లయ్య, మాజీ ఎంపీపీ కాటిపెల్లి ఆదిరెడ్డి, ఉప సర్పంచ్ లు మద్దెల నర్సయ్య, బద్దం హరీష్, బిఆర్ఎస్ నాయకులు లింగ స్వామి, కదుర్క నర్సయ్య, శరత్ గౌడ్,లస్మయ్య ,లక్ష్మణ్, నాగరాజు, జైపాల్ రెడ్డి, పెద్దిరెడ్డి లక్ష్మణ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# బోయకొండను సందర్శించిన దేవాదాయ సంయుక్త కమిషనర్



**చౌడేపల్లి ప్రతినిధి మార్చి 10 రిపబ్లిక్ న్యూస్**
శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ తిరుపతి చంద్రశేఖర్ ఆజాద్ సందర్శించారు శక్తి క్షేత్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆయన తనిఖీ చేశారు.కొండ కింద వసతి గృహ నిర్మాణము పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ వారు స్వాధీన పరిచిన కమ్యూనిటీ భవనము మెట్ల మార్గంలో భక్తులకు నీడకు రూప్ టాప్ నిర్మాణం పనులు కొండపైన మరుగుదొడ్ల నిర్మాణము మొదలుకు పనులను పరిశీలించారు. అదేవిధంగా సిసి కెమెరాలు పరిశీలించి దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఉప కమిషనర్ ఏకాంబరముకు పలు సూచనలు ఇచ్చారు అనంతరం ఆలయ మర్యాదలతో సత్కరించి అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో డి ఈ జనార్ధన్ ,ఏ ఈ ఆనంద్, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

# పైప్ లైన్ మరమ్మతుల నేపథ్యంలో నీటి సరఫరా నిలిపివేత

**అవుకు మార్చ్ 10 రిపబ్లిక్ (న్యూస్)**
నంద్యాల జిల్లా అవుకు గ్రామంలో తాగునీటి పైప్ లైన్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఈరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు గ్రామపంచాయతీ అధికారులు తెలిపారు ఇటీవల పైప్ లైన్ తలెత్తిన లోపాలను దృష్టిలో ఉంచుకొని మరమ్మతులు అత్యవసరంగా చేపట్టాల్సి వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.



గ్రామంలో నీటి సరఫరా నిలిపివేయబడనున్న విషయాన్ని గ్రామస్తులకు ముందస్తుగా తెలియజేయడానికి పంచాయతీ సిబ్బంది మైక్ అనౌన్స్మెంట్ ద్వారా సమాచారం అందించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నీటి సరఫరా ఉండదని స్పష్టం చేస్తూ, అవసరమైన తాగునీటిని ముందుగానే నిల్వ చేసుకోవాలని ప్రజలకు సూచించారు.మరమ్మతుల పనులను వేగంగా పూర్తి చేసి సాయంత్రం తర్వాత మళ్లీ సాధారణంగా నీటి సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ పనుల సమయంలో గ్రామస్తులు సహకరించాలని కూడా కోరారు. పైప్ లైన్ మరమ్మతులు పూర్తయిన అనంతరం గ్రామంలో తాగునీటి సరఫరా నిరంతరంగా కొనసాగేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు

# ప్రేమించి పెళ్లి చేసుకుని


**- తల్లికి ఇష్టం లేకపోవడంతో వరుడు ఆత్మహత్యాయత్నం**

**- మనస్థాపనతో ఉరేసుకుని వధువు ఆత్మహత్య**

**మహానంది, మార్చి 10, (రిపబ్లిక్ న్యూస్)**
మహానందికి చెందిన శివకుమార్, స్వప్న(21) గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. కులాలు వేరైనా ఒకరినొకరు ఇష్టపడడంతో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా సోమవారం ఇద్దరూ దండలు మార్చుకుని వివాహం చేసుకున్నారు. అయితే శివకుమార్ తల్లికి వీరి పెళ్లి ఇష్టం లేకపోవడంతో ఆందోళనకు గురైన శివకుమార్ తన ఇంట్లో ఫ్యాన్ కు ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా గుర్తించిన తల్లి, కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించడంతో శివకుమార్ ప్రాణాలతో బయటపడ్డాడు. తన ప్రియుడికి ఏమవుతుందో అనే మనస్థాపంతో స్వప్న మహానంది మహానంది నుంచి గాజులపల్లె వెళ్లే మార్గంలో ఉన్న జినశంకర తపోవనం ఎదురుగా నల్లమల అటవీ ప్రాంతం లోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు స్వప్న మృతితో శోక సంద్రంలో మునిగారు. మహానంది ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించడంతో పాటు స్వప్న మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు స్వప్న తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్మోహన్ రెడ్డి వివరించారు.



# ఠాగూర్ సినిమా సీన్ సేమ్ రిపీట్..



**- తొమ్మిది రోజులకు మూడు లక్షలు ముక్కు పిండి వసూలు..**

**- 45 వేలు చెల్లిస్తేనే మృతదేహాన్ని ఇస్తామని దందా నడిపిన యజమాన్యం..**

**- రమాదేవి మల్టీస్పెషల్టి హాస్పిటల్ ను వెంటనే సీజ్ చేయాలి..సిపిఐ రాష్ట్ర కార్యదర్శి**

**ఏపీ బ్యూరో,**
**మార్చి 10 - (రిపబ్లిక్ న్యూస్) -**
తిరుపతి నగరంలోని స్థానిక భవాని నగర్ లో ఉన్న రమాదేవి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను తక్షణమే సీజ్ చేయాలని సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మంగళవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ పలమనేరు మండలం జీడిమాకులపల్లికి చెందిన శ్రీనివాస్ అనే యువకుడు బ్రెయిన్ స్ట్రోక్ తో తొమ్మిది రోజుల క్రితం హాస్పిటల్లో అడ్మిషన్ అయినప్పటికీ 3 లక్ష రూపాయలు యాజమాన్యం వసూలు చేయడం జరిగిందని వివరించారు. చివరకు ఠాగూర్ సినిమా సీన్ ను సేమ్ రిపీట్ చేస్తూ ఆ సినిమాలో మాదిరిగా వైద్యం అందించినట్టు నటిస్తూ ఆఖరికి శవాన్ని చేతికి ఇచ్చారు. తల్లి పుస్తుల తాకట్టు పెట్టి హాస్పిటల్లో ఫీజు చెల్లించిన కుటుంబ సభ్యులు మరణించినప్పటికీ ఏమాత్రం మానవత్వం లేకుండా జలగలా రక్తం పీడిస్తూ 45 వేల రూపాయలు చెల్లించాలని పట్టు పట్టారు. మంగళవారం ఉదయం నుంచి మృతదేహాన్ని అంటి పెట్టుకొని ఆసుపత్రి యజమాన్యం దందా నడిపింది. ఏ మాత్రం మానవత్వం



లేకపోగా సంబంధిత శాసనసభ్యులు ఫోన్ చేసిన స్పందించకుండా నిర్లక్ష్యంగా మాట్లాడి ముక్కు పిండి మరి డబ్బులు వసూలు చేశారు. ఈ ఉదంతంపై ఆస్పత్రి యజమాన్యంపై మరియు హాస్పిటల్ పై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వెంటనే విచారణ చేపట్టి నిజాం నిర్ధారణ రాబట్టి మానవత్వం లేని ఆస్పత్రిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. పేదల రక్తాన్ని జలగల్లాగా రక్తం తాగుతున్న రమాదేవి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ పై నిర్లక్ష్యం వహించకుండా తక్షణమే జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని సిపిఐ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. హాస్పిటల్ పై చర్యలు తీసుకొని పక్షంలో సిపిఐ పార్టీ తరఫున అన్ని పార్టీలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. దానికి తోడు జిల్లా వైద్య శాఖ అధికారులు కూడా ప్రైవేట్ హాస్పిటల్ పై నిర్లక్ష్యం వహించడం వాళ్లు ఇచ్చే మామూళ్లకు లొంగి బాధ్యత రహితంగా వ్యవహరించడం సరికాదన్నారు. ప్రభుత్వ జీతం తీసుకుంటూ ప్రవేట్ ఆసుపత్రి యజమాన్యానికి తొత్తుల వ్యవహరిస్తున్న జిల్లా వైద్య శాఖ అధికారుల పై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల ప్రాణాలపై కూటమి ప్రభుత్వ నేతలకు కొద్దిగా అయినా చిత్తశుద్ధి ఉంటే








తక్షణమే విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తూ ఆ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రుణాలు మంజూరు చేయాలి

## 2026-27 పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్‌కు రూ.14,576 కోట్లు -జిల్లా రెవెన్యూ అధికారి డి. రాము నాయక్

**నంద్యాల, బ్యూరోమార్చి 10 (రిపబ్లిక్ న్యూస్):**
ప్రభుత్వ సంక్షేమ పథకాలలో అర్హులైన లబ్ధిదారులకు విస్తృతంగా రుణాలు మంజూరు చేయడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల విజయవంతమైన అమలుకు బ్యాంకులు ఆర్థిక సహకారం అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి డి. రాము నాయక్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ సమావేశం జిల్లా రెవెన్యూ అధికారి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆర్బీఐ ఎల్డిఓ రామకృష్ణ, యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ నరసింహారావు, నాబార్డ్ డిడిఎం కార్తీక్, ఎల్డిఎం రవీంద్ర కుమార్, లైన్ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఓ రాము నాయక్ మాట్లాడుతూ జిల్లాలో బ్యాంకులు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా రైతులు, స్వయం ఉపాధి పొందే యువత మరియు మహిళా సంఘాలకు రుణాల మంజూరులో బ్యాంకులు మరింత చురుకుగా వ్యవహరించాలని సూచించారు. ప్రధానమంత్రి ముద్రా యోజన, స్టాండ్ అప్ ఇండియా, పీఎంఎఫ్‌బీవై, పీఎంస్వనిధి వంటి పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు రుణాలను సకాలంలో మంజూరు చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. అలాగే వ్యవసాయ రుణాలు, పంట రుణాల పంపిణీ, స్వయం సహాయక సంఘాలకు రుణాల మంజూరుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లాలో ప్రాధాన్యత రంగ రుణాల పంపిణీ లక్ష్యాలను బ్యాంకులు తప్పనిసరిగా చేరుకోవాలని, పెండింగ్‌లో ఉన్న రుణ దరఖాస్తులను







త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో బ్యాంకులు, సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నాబార్డ్ డిడిఎం కార్తీక్ మాట్లాడుతూ రాష్ట్రంలో సాగుచేసే ప్రధాన పంటలకు వ్యాల్యూ చైన్ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదన్నారు. రైతులకు మెరుగైన ఆదాయం అందించేందుకు షేడ్ నెట్స్, పాలీహౌస్‌లు, కోల్డ్ స్టోరేజ్‌లు, ప్రాసెసింగ్ యూనిట్లు, గ్రేడింగ్ మరియు ప్యాకింగ్ వంటి మౌలిక సదుపాయాలు అవసరమని తెలిపారు. రాయలసీమ ప్రాంతంలో ఉద్యానవన పంటలకు ఎగుమతి అవకాశాలు ఉన్నప్పటికీ, స్థానిక బ్యాంకుల నుంచి ఎగుమతి క్రెడిట్ పొందడంలో వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో బనగానపల్లె, బేతంచెర్ల ప్రాంతాల నుంచి ఎగుమతులను మరింత ప్రోత్సహించే చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అగ్రి క్లినిక్స్–అగ్రి బిజినెస్ బిసెంటర్స్ పథకం కింద నంద్యాల జిల్లాలో ఇప్పటివరకు యూనిట్లు మంజూరు కాలేదని పేర్కొన్నారు. రైతులు మరియు యువతలో అవగాహన పెంచేందుకు బ్యాంకుల్లో బ్రోచర్లు, పోస్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ పథకంలో ప్రాజెక్టు ఖర్చుపై 40 శాతం వరకు సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. అదేవిధంగా ఫార్మర్ ప్రొడ్యూసర్క ప్రాధాన్యత రంగ రుణాల కింద బ్యాంకులు సహకారం అందించాలని, ప్రతి బ్యాంకు కనీసం 40 శాతం ఎఫ్ బి ఓలకు రుణాలు అందించే లక్ష్యంతో ముందుకు రావాలని సూచించారు. ఆర్బీఐ ఎల్డిఓ రామకృష్ణ మాట్లాడుతూ 2025 జూలై నుండి 2026 జూన్ వరకు నిర్వహిస్తున్న కేవైసీ ప్రక్రియ గురించి వివరిస్తూ గడువు ముగియడానికి మూడు నెలలు మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో అన్ని బ్యాంకులు వేగవంతంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్రియాశీల ఖాతాల్లో కూడా అనేక కేవైసీలు పెండింగ్‌లో ఉండటం ఆందోళనకరమని తెలిపారు. కేవైసీ ప్రక్రియను సులభతరం చేసేందుకు ఖాతాలను రెండు గ్రూపులుగా విభజించినట్లు తెలిపారు. ఫోకస్డ్ గ్రూప్‌లో క్రియాశీల ఖాతాలు మరియు ఒక సంవత్సరం కంటే తక్కువ కాలంగా నిలిచిపోయిన ఖాతాలు ఉంటాయని, రెండవ గ్రూప్‌లో ఒక సంవత్సరం కంటే ఎక్కువ కాలంగా నిలిచిపోయిన ఖాతాలు మరియు డి ఎ ఎఫ్ ఖాతాలు ఉంటాయని వివరించారు. మార్చి నెలాఖరు నాటికి ఫోకస్డ్ గ్రూప్‌కు చెందిన అన్ని ఖాతాల కేవైసీలను పూర్తి చేసి పెండెన్సీని సున్నా స్థాయికి తీసుకురావాలని బ్యాంకులకు సూచించారు. ఈ ప్రక్రియను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ స్వయంగా పర్యవేక్షిస్తున్నందున బ్యాంకులు అత్యంత ప్రాధాన్యతతో తీసుకోవాలని తెలిపారు. మొత్తం 4243 బ్యాంకుల్లో సుమారు 15 బ్యాంకుల్లోనే 99.68 శాతం కేవైసీ పెండెన్సీ నమోదైందని, అందువల్ల ఆయా బ్యాంకులు తక్షణమే ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ జాబితాలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఏపీజీబీ, కెనరా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, కోటక్ మహీంద్రా బ్యాంక్, కరూర్ వైశ్యా బ్యాంక్, కర్ణాటక బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూకో బ్యాంక్ మరియు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉన్నాయని తెలిపారు. ఈ బ్యాంకులు తక్షణమే స్పందించి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. అంతకుముందు ఎల్డిఎం రవీంద్ర కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద కేటాయించిన లక్ష్యాల సాధనలో బ్యాంకులు సాధించిన ప్రగతిని కమిటీకి వివరించారు. అనంతరం డిజిటల్ పేమెంట్స్ మరియు నాబార్డ్ 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, వివిధ బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ బుక్కాపురం లో వైభవంగా గ్రామ దేవతల ఉత్సవాలలో పాల్గొన్న మాజీ మంత్రి బుగ్గన

**బేతంచర్లది ప్రతినిధి, మార్చి 10,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
బేతంచెర్ల మండలం పరిధిలోని ఆర్ బుక్కాపురం గ్రామంలో మంగళవారం గ్రామ దేవతల దేవర మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు మంగళ వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి బుగ్గన తో పాటు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, ఎంపీటీసీ మునేశ్వర రెడ్డి, మండల వైసిపి సీనియర్ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల మాజీ డైరెక్టర్ బాబు రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ మూర్తు జావలి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కాజా హుస్సేన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారామ చంద్రుడు, జిల్లా అధికార ప్రతినిధి పుసులూరు మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ రంగస్వామి, మండల కన్వీనర్ కుంచా తిరుమలేశ్వర్ రెడ్డి,టౌన్ కన్వీనర్ షేక్ పిట్టల జాకీర్ హుస్సేన్, వైసీపీ నాయకులు బొల్లవరం శ్రీనాథ్ రెడ్డి, మనుమోహన్ రెడ్డి, టౌన్ ఉపాధ్యక్షులు అడపాల తిరుమలేష్, బుక్కాపురం గ్రామ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



## నూతన గృహప్రవేశానికి హాజరైన మాజీ మంత్రి బుగ్గన



**బేతంచెర్ల ప్రతినిధి, మార్చి 10,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
బేతంచర్ల మండల పరిధిలోని నాగమల్ల కుంట గ్రామంలో మంగళవారం రోజున వైసీపీ నాయకులు ఎద్దుల మధుమోహన్ రెడ్డి, ఎద్దుల మహేశ్వర రెడ్డి నూతన గృహప్రవేశం చేశారు మరియు పెద్ద రాజు దర్గా, జమ్ములమ్మ, సుంకులమ్మ దేవతలకు మొక్కుబడి కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రివర్యులు శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు. మాజీ మంత్రి బుగ్గన తో పాటు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, ఎంపీటీసీ మునేశ్వర రెడ్డి, మండల వైసిపి సీనియర్ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల మాజీ డైరెక్టర్ బాబు రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ మూర్తు జావలి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కాజా హుస్సేన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారామ చంద్రుడు, జిల్లా అధికార ప్రతినిధి పుసులూరు మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ రంగస్వామి, మండల కన్వీనర్ కుంచా తిరుమలేశ్వర్ రెడ్డి,టౌన్ కన్వీనర్ షేక్ పిట్టల జాకీర్ హుస్సేన్, వైసీపీ నాయకులు బొల్లవరం శ్రీనాథ్ రెడ్డి, మనుమోహన్ రెడ్డి, టౌన్ ఉపాధ్యక్షులు అడపాల తిరుమలేష్, నాగమల్లకుంట గ్రామ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



## పోతుల శేశిరెడ్డి ఆహ్వానం మేరకు గద్వాల జమ్ములమ్మ కు నిర్వహించిన పూజ కార్యక్రమంలో పాల్గొన్న కాటసాని ఉమామహేశ్వరమ్మ

**కల్లూరు ప్రతినిధి, మార్చి 10,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
కల్లూరు అర్బన్ 19వ వార్డు కర్నూల్ నగరంలో గణేష్ నగర్ లో ఉన్న శ్రీనివాస గార్డెన్ నందు పోతుల శేశిరెడ్డి, గద్వాల జమ్ములమ్మకు ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించిన కాటసాని ఉమామహేశ్వరమ్మ ఈ కార్యక్రమంలో 19 వ వార్డు గణేష్ నగర్ వైఎస్ఆర్సిపి నాయకులు నల్లబోలు గోపాల్ రెడ్డి, తిరుమల్ మరియు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు



## సావిత్రిబాయి పూలే 129 వర్ధంతి ఘనంగా నిర్వహించిన రాయలసీమ మహిళ సంఘ్

**రాయలసీమ,శకుంతల**

**కర్నూలు ప్రతినిధి, మార్చి 10,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
అశోక్ నగర్ లో గల పట్టణ నిరాశ్రయులయ వసతి గృహం నందు మంగళవారం రోజున సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళ రాష్ట్ర కార్యదర్శి,రాయలసీమ మహిళ సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షురాలు రాయలసీమ శకుంతల మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే 1831 జనవరి 3వ తేదీన మహారాష్ట్ర లో జన్మించింది సావిత్రిబాయిపూలే భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, స్త్రీ విద్య కొరకు పాటుపడిన మహనీయురాలు జ్యోతిరావు పూలే ఖుషి పట్ల ఏర్పడిన జ్వాల నే నిశ్శబ్ద విప్లవం సావిత్రిబాయి అని వారు అన్నారు. అంతేగాక సావిత్రిబాయిపూలే శూద్ర అతిశూద్ర బాల బాలికల విద్యకు సర్వం త్యాగం చేసిన మహనీయురాలు, స్త్రీలు బాల్య వివాహాలు మరియు సతీసహగమనం ఆ రోజుల్లో ఎక్కువగా ఉండేవి వాటిని రూపుమాపడానికి విద్య ఒక్కటే మార్గమని కొనియాడారు భారతదేశంలో మొదటి ఉపాధ్యాయురాలిగా ఆమెను ప్రకటించడం జరిగింది,1852లో మహిళా సేవా మండల్ అనే మహిళా సంఘాన్ని సావిత్రిబాయి స్థాపించారని వారు తెలిపారు. మహిళా ఉద్యమ మహోన్నత స్త్రీ మూర్తి సావిత్రి బాయిపూలే అని వారు తెలిపారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఆమె సేవలను గుర్తించాలి అన్నారు. ఆమె దగ్గర ఉన్న ఒక అభాగ్యురాలి కొడుకుని దగ్గరికి తీసుకొని పెంచి డాక్టర్లు చదివించారు. ఎంతోమందికి ఆదర్శంగా ఉన్నారు. సావిత్రిబాయికి జ్యోతిరావు పూలే మొదటి గురువుగా వ్యవహరించారు. ప్రతి విషయంలోనే అండగా ఉంటూ ఆమెను ఒక ఉపాధ్యాయురాలుగా చేసిన ఘనత జ్యోతిరావు పూలేదే. ప్లగ్ వ్యాధి వచ్చి ఆమె మార్చి 10వ తేదీన మరణించారు కార్యక్రమంలో వసతి గృహ నిర్వహకురాలు. నిరాశ్రయ మహిళలు తదితరులు పాల్గొన్నారు



## ఇందిరమ్మ కాలనీలో భూ కబ్జాల దందా- రోడ్లు, పార్కులే లక్ష్యం!

### ప్రభుత్వ లేఅవుట్‌ను ధ్వంసం చేస్తూ భూముల విక్రయం ప్రశ్నించిన కాలనీ వాసులకు బెదిరింపులు

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 10)**
కర్నూలు జిల్లా కల్లూరు మండలం పందిపాడు ఇందిరమ్మ కాలనీలో భూ కబ్జాదారులు బరితెగిస్తున్నారు. ప్రభుత్వ లేఅవుట్ ప్రకారం ప్రజల సౌకర్యార్థం కేటాయించిన రోడ్లు, పార్కులు వంటి స్థలాలను అక్రమంగా ఆక్రమించి ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్న ఘటన వెలుగులోకి వచ్చింది. దీంతో సుమారు 2500 మంది నిరుపేదల ఆశలపై నీళ్లు చల్లుతున్నారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వివరాల్లోకి వెళ్తే.. 2010లో ప్రభుత్వం పేదల నివాసార్థం పందిపాడు ప్రాంతంలో ఇందిరమ్మ కాలనీకి ప్లాట్లు కేటాయించింది. లేఅవుట్ ప్రకారం నాలుగు పెద్ద పార్కులు, విశాలమైన రోడ్లు మరియు ప్రజా అవసరాల కోసం ఖాళీ స్థలాలు వదిలారు. అయితే ఇటీవల కాలంలో భూముల ధరలు పెరగడంతో కబ్జాదారుల కన్ను ఈ ప్రజా స్థలాలపై పడింది. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లు, పార్కుల స్థలాలను ఆక్రమించి వాటిని ప్లాట్లుగా మార్చి అమాయకులకు విక్రయిస్తూ కోట్లు గడిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



**ప్రశ్నిస్తే దౌర్జన్యం:**
ఈ అక్రమాలపై కాలనీ వాసులు రాము, శేఖర్ రెడ్డి, అన్వర్ భాష తదితరులు మంగళవారం కల్లూరు తహశీల్దార్ కె. ఆంజనేయులు, నాలుగో పట్టణ సీఐ విక్రమ్ సింహలను కలిసి వినతిపత్రం అందజేశారు. కబ్జాదారులను ప్రశ్నిస్తే దౌర్జన్యానికి దిగుతూ "ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండిడ మాకు ఎలాంటి భయం లేదు" అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని అధికారులు దృష్టికి తీసుకెళ్లారు.

**కఠిన చర్యలు తీసుకోవాలి:**
కాలనీ లేఅవుట్‌ను అధికారులు తక్షణమే పరిశీలించి ఆక్రమణకు గురైన రోడ్లు, పార్కు స్థలాలను తిరిగి స్వాధీనం చేసుకోవాలని కాలనీ నివాసులు రాము, అన్వర్ భాషా, శేఖర్ రెడ్డి, మౌలాలి, శ్రీదేవి, ప్రసాద్, నాగరాజు తదితరులు డిమాండ్ చేశారు. భూ కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి పేదల ఆస్తులను రక్షించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన అధికారులు విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## రోడ్డు ప్రమాదంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు చిన్నమ్మ మృతి

### ఉండవెల్లి వద్ద బైక్‌ను తప్పించబోయి చెట్టును ఢీకొన్న కారు -ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మణెమ్మ కన్నుమూత

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 10)**
కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. ఆయన చిన్నాన్న కుటుంబం ప్రయాణిస్తున్న కారు రోడ్డు ప్రమాదానికి గురై ఎంపీ చిన్నమ్మ మణెమ్మ మృతి చెందారు.

తెలంగాణ రాష్ట్రంలోని ఉండవెల్లి మండలం కంచిపాడు జమ్ములమ్మ ఆలయానికి కారులో వెళుతుండగా ఉండవెల్లి సమీపంలో అడ్డుగా వచ్చిన బైక్‌ను తప్పించబోయిన కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మణెమ్మను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ ఆమె ప్రాణాలు దక్కలేదు.

అదే కారులో ఉన్న ఎంపీ చిన్నాన్న మద్దిలేటి, ఆయన కుమారుడు నాగరాజుకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రస్తుతం వారికి ప్రమాదం నుంచి బయటపడినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఢిల్లీలో ఉన్న ఎంపీ బస్తిపాటి నాగరాజు చిన్నమ్మ మృతి వార్త తెలుసుకుని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే ఢిల్లీ నుంచి కర్నూలుకు బయలుదేరినట్లు తెలిసింది. మణెమ్మ మృతితో ఎంపీ కుటుంబంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనపై కేసు నమోదు చేసిన ఉండవెల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.






ప్రజా రిపబ్లిక్

బుధవారం 11 మార్చి 2026

# జీజీహెచ్‌లో అగ్నిప్రమాదాలపై భారీ అవగాహన కార్యక్రమం - మాక్ డ్రిల్ నిర్వహణ

**సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది 'ఫస్ట్ రెస్పాండర్స్'గా వ్యవహరించాలి -సూపరింటెండెంట్ డా. కె. వెంకటేశ్వర్లు**

**ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ల వినియోగంపై ప్రత్యక్ష శిక్షణ - జిల్లా అగ్నిమాపక అధికారి జి. బాలరాజు**







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 10)**
స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమం మరియు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె. వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సెక్యూరిటీ సిబ్బంది, శానిటేషన్ కార్మికులు, డాక్టర్లు, నర్సింగ్ సిబ్బందికి అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆసుపత్రిలోని ప్రతి విభాగంలో ఉన్న అగ్నిమాపక పరికరాలు మరియు విద్యుత్ వైరింగ్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. కాలం చెల్లిన ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లను వెంటనే రీఫిల్ చేయించి, ఫైర్ అలారం వ్యవస్థల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రమాదం సంభవించిన తొలి ఐదు నిమిషాలు 'గోల్డెన్ అవర్'గా కీలకమని, అగ్నిమాపక దళం చేరుకునేలోపు స్థానిక సిబ్బంది ప్రాథమికంగా స్పందిస్తే భారీ నష్టాన్ని నివారించవచ్చని తెలిపారు. ఆసుపత్రిలో 24 గంటలు విధులు నిర్వర్తించే సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది అత్యవసర సమయాల్లో 'ఫస్ట్ రెస్పాండర్స్'గా వ్యవహరించాలని అన్నారు.

జిల్లా అగ్నిమాపక అధికారి జి. బాలరాజు మాట్లాడుతూ ఆసుపత్రుల్లో షార్ట్ సర్క్యూట్లు లేదా గ్యాస్ లీకేజీల కారణంగా ప్రమాదాలు సంభవించే అవకాశం ఉండటంతో సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంటలను ఆర్పేందుకు ఉపయోగించే ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లను ఎలా వినియోగించాలో సిబ్బందికి ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపించారు. సెక్యూరిటీ, నర్సింగ్ సిబ్బందితో స్వయంగా మంటలను ఆర్పించేలా ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చామని తెలిపారు.

ప్రమాదం జరిగిన సమయంలో కంగారు పడకుండా రోగులను సురక్షిత ప్రాంతాలకు ఎలా తరలించాలో (ఎవాక్యుయేషన్ ప్రక్రియ) వివరించారు. ముఖ్యంగా ఐసీయూ మరియు వార్డుల్లో పనిచేసే సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు డా. లక్ష్మీ భాయి, డా. నాగేశ్వరరావు, డిప్యూటీ సిఎస్ఆర్ ఎమ్ఓ లు డా. పద్మజ, డా. వెంకటరమణ, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, డా. శివ బాల, డా. కిరణ్, డా. సునీల్ ప్రశాంత్, డా. క్లింటన్, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రి భాయి తదితర ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీశైలం వెళ్లే భక్తులు ఓవర్‌లోడ్ వాహనాల్లో ప్రయాణించవద్దు

**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్**

**భక్తుల భద్రతే ప్రధాన లక్ష్యం ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలి వాహనాల్లో గ్యాస్ సిలిండర్లు రవాణా చేసే సమయంలో జాగ్రత్తలు అవసరం**



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 10)**
కర్నూలు వైపు నుండి శ్రీశైలం మల్లన్న దర్శనార్థం వెళ్లే భక్తులు ఓవర్‌లోడ్ వాహనాల్లో ప్రయాణించవద్దని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. వాహనాల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం ప్రమాదాలకు దారితీసే అవకాశముందని ఆయన హెచ్చరించారు. మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి కర్నూలు జిల్లా మీదుగా శ్రీశైలం దేవస్థానాన్ని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్న నేపథ్యంలో రహదారులపై రద్దీ పెరుగుతున్నదని తెలిపారు. ఈ పరిస్థితుల్లో కొన్ని వాహనాల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఎక్కించుకుని ప్రయాణించడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు.

ముఖ్యంగా ఆటోలు, జీపులు, ట్రాక్టర్లు మరియు ఇతర చిన్న వాహనాల్లో ఓవర్‌లోడ్‌గా ప్రయాణించడం ప్రాణాపాయానికి దారితీస్తుందని ఎస్పీ హెచ్చరించారు. అలాగే వాహనాల్లో వంట గ్యాస్ సిలిండర్లు రవాణా చేసే సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

భక్తులు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తూ జాగ్రత్తగా ప్రయాణించాలన్నారు. డ్రైవర్లు వేగ నియంత్రణలో వాహనాలు నడపాలని, అలసటగా ఉన్నప్పుడు వాహనం నడపకుండా కొంతసేపు విశ్రాంతి తీసుకుని తరువాత ప్రయాణం కొనసాగించాలని సూచించారు.

ప్రయాణ సమయంలో ఎక్కడైనా సమస్యలు తలెత్తినా లేదా రోడ్డు ప్రమాదాలు జరిగినా వెంటనే సమీప పోలీసులను సంప్రదించాలని కోరారు. భక్తుల భద్రత కోసం పోలీసు అధికారులు ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటించి పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

భక్తుల క్షేమమే పోలీసు శాఖకు ప్రధాన లక్ష్యమని, అందరూ సురక్షితంగా ప్రయాణించేందుకు సహకరించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు.

ఓవర్‌లోడింగ్ కేసులు:
జిల్లాలో 2025 సంవత్సరంలో 401 ఓవర్‌లోడింగ్ కేసులు నమోదు కాగా, 2026 సంవత్సరంలో ఫిబ్రవరి వరకు 43 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు.

# గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ టీకా ప్రారంభం

**ప్రభుత్వ వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి ఆరోగ్యం పట్ల ముందు జాగ్రత్త అవసరం**

**14 ఏళ్లలోపు బాలికలకు ఉచితంగా టీకా మంత్రి టి.జి.భరత్**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 10)**
ప్రభుత్వం అందిస్తున్న వైద్య సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యం పట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరమని పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ తెలిపారు. మంగళవారం ఉదయం కర్నూలు ఏక్యాంప్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ కోసం ఏర్పాటు చేసిన హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) టీకా కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, 14 సంవత్సరాలు ప్రారంభమై 15 సంవత్సరాల లోపు వయస్సు గల బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించే హెచ్‌పీవీ టీకాను ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నదన్నారు. సుమారు నాలుగు వేల రూపాయల విలువ చేసే ఈ టీకాను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని, అందరూ దీనిపై అవగాహన కల్పించాలని ఆయన కోరారు. అన్ని వైద్య పరీక్షలు పూర్తి చేసి, 96 శాతం విజయశాతం ఉన్న ఈ టీకాను కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. గత నెల 28న దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజస్థాన్ రాష్ట్రంలోని అజ్మీర్‌లో, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయవాడలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. జిల్లాలో సుమారు 30 వేల మంది బాలికలకు ఈ టీకా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ, మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అవసరమైన టీకాలు, మందులు సమయానికి తీసుకోవడం చాలా ముఖ్యమని చెప్పారు. కోవిడ్19 సమయంలో రోగ నిరోధక శక్తి కోసం టీకాలు తీసుకున్న విషయాన్ని గుర్తుచేశారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు ఈ టీకా ఎంతో ప్రయోజనకరమని, సరైన వయస్సులో బాలికలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ, ఈ టీకా ఒకే డోస్‌గా ఇవ్వబడుతుందని తెలిపారు. పాఠశాలల్లో కాకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత్రమే అర్హత ఉన్న వయస్సు గల బాలికలకు ఉచితంగా వేయడం జరుగుతుందని చెప్పారు. జిల్లాలో దాదాపు 30 వేల మందికి టీకా వేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమ, ఆసుపత్రి సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల సహకారంతో స్వచ్ఛ సర్వేక్షన్‌లో మెరుగైన ర్యాంకు సాధించాలి

**శానిటేషన్ పనులను పటిష్టంగా అమలు చేయాలి కమిషనర్ పి. విశ్వనాథ్**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 10)**
నగర ప్రజల సహకారంతోనే స్వచ్ఛ సర్వేక్షన్‌లో మెరుగైన ర్యాంకు సాధించి జాతీయ స్థాయిలో నగరానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావచ్చని నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ అన్నారు. మంగళవారం నగరపాలక సంస్థ క్యాంపు కార్యాలయంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లతో స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. నగరంలోని అన్ని వార్డుల్లో 100 శాతం చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాణిజ్య దుకాణాల వద్ద తప్పనిసరిగా డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసుకునేలా వ్యాపారస్తులకు అవగాహన కల్పించాలని సూచించారు.

ప్రతి వార్డులో కనీసం 100 గృహాలు హోం కంపోస్టింగ్ చేపట్టేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షన్ బృందం మరియు శానిటేషన్ సిబ్బంది సంయుక్తంగా నగరవ్యాప్తంగా 300 ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

అదేవిధంగా శానిటేషన్ వాహనాల మరమ్మత్తులు తక్షణమే పూర్తి చేయాలని, ముఖ్యమైన బ్లాక్ స్పాట్స్ ప్రాంతాల్లో మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగ ప్రసాద్ బాబు, డీఈఈ పవన్ కుమార్ రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## మృతి చెందిన కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి బుగ్గన





**బేతంచెర్ల ప్రతినిధి, మార్చి 10,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
బేతంచెర్ల మండల పరిధిలోని ఆర్ ఆర్ బుక్కాపురం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు లోడింగ్ ఎర్రమల దుబ్బ వెంకటేశ్వర్లు (65) గత పది రోజుల క్రిందట అనారోగ్యంతో మృతి చెందారు విషయం తెలుసుకున్న రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మంగళవారం రోజున,బుక్కాపురం గ్రామానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు, ఆదార్యపడవద్దని అండంగా ఉంటామని తెలిపారు. మాజీ మంత్రి బుగ్గన తో పాటు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, ఎంపీటీసీ మునేశ్వర రెడ్డి, మండల వైసిపి సీనియర్ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల మాజీ డైరెక్టర్ బాబు రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ మూర్తు జావలి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కాజా హుస్సేన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారామ చంద్రుడు, జిల్లా అధికార ప్రతినిధి పుసులూరు మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ రంగస్వామి, మండల కన్వీనర్ కుంచా తిరుమలేశ్వర్ రెడ్డి,టౌన్ కన్వీనర్ షేక్ పిట్టల జాకీర్ హుస్సేన్, వైసీపీ నాయకులు బొల్లవరం శ్రీనాథ్ రెడ్డి, మనుమోహన్ రెడ్డి, టౌన్ ఉపాధ్యక్షులు అడపాల తిరుమలేష్, బుక్కాపురం వైసిపి నాయకులు బలరాముడు, రమణ, సురేష్, చిన్న నాయుడు, లోడింగ్ నాయుడు, దశరథ్, మద్దిలేటి స్వామి తదితరులు పాల్గొన్నారు

## పదవ తరగతి పరీక్ష పేపర్లను ఓర్వకల్ పోలీస్ స్టేషన్లో భద్ర పరిచిన మండల అధికారులు మరియు సంబంధిత అధికారులు

**ఓర్వకల్లు మండలంలో పదవ తరగతి పరీక్షలకు 952 మంది విద్యార్థులు**



**ఓర్వకల్లు ప్రతినిధి, మార్చి 10,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ఓర్వకల్లు మండలంలో 2025 - 2026 విద్యా సంవత్సరానికి సంబంధించి పదవ తరగతి పరీక్షలను మొత్తం 952 మంది విద్యార్థులు వ్రాయుచున్నారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 838 మరియు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 80 మిగిలిన 34 మంది ప్రైవేట్ గా వ్రాయుచున్నారు. మండలంలో మొత్తం ఐదు పరీక్ష కేంద్రాలు
1.ZPHS, ఓర్వకల్లు - 1562.APMS, ఓర్వకల్లు - 200 3.APRS, కాల్వబుగ్గ - 2064.ZPHS, నన్నూరు - 2585.GHS, లొద్దిపల్లె - 132 మొత్తం 952 మంది విద్యార్థులు ఈ పరీక్ష కేంద్రాలలో పరీక్ష వ్రాయబోతున్నారు. ఈ పరీక్షలకు సంబంధించి 09.03.2026 తేదీన రాజు-1 ప్రశ్న పత్రాలు రావడం జరిగింది. అదేవిధంగా 10.03.2026 న రాజు-2 ప్రశ్న పత్రాలు రావడం జరిగింది. వీటిని మండల విద్యాశాఖ అధికారి జి ఓంకార్ యాదవ్ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాలకు నియమించబడిన చీఫ్ సూపర్డెంట్లు , డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్ మరియు కస్టోడియాన్స్ ఆధ్వర్యంలో ఓర్వకల్ పోలీస్ స్టేషన్ నందు భద్రపరచడం జరిగింది, మండల విద్య శాఖ అధికారి ఓంకార్ యాదవ్ మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ నుండి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలను విద్యార్థులు బాగా చదువుకుని మంచి మార్కులు సాధించాలని చెప్పారు అలాగే మీపై పెట్టుకున్న మీ తల్లిదండ్రులు నమ్మకాన్ని మనసులో పెట్టుకొని పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు రావాలని విద్యార్థులకు తెలియజేయడం జరిగింది

## బుద్ధానగర్ గ్రామంలో పొదుపు గ్రూపులలో అవకతవకలు జరిగాయని కలెక్టర్ ఆదేశాలతో ఆడిటింగ్ చేసిన అధికారులు



**పాములపాడు మార్చి 10 రిపబ్లిక్ న్యూస్:-**
పాములపాడు మండలంలోని, బుద్ధానగర్ గ్రామంలో పొదుపు గ్రూపులో బుక్ కీపర్ అవకతవకలు చేసారని నంద్యాల జిల్లా కలెక్టర్ కి కంప్లీట్ ఇవ్వగా. కలెక్టర్ గారూ పొదుపు డిపార్ట్మెంట్ కి సంబందించిన అధికారులకు ఆదేశాలు జారీ చేసి నాకు దీనికి సంబందించిన రికార్డ్స్ మొత్తం సమాకూర్చాలని చెప్పగా మిట్టకందాల, వాల్మీకినగర్, బుద్ధానగర్ గ్రామాల పొదుపు లక్ష్మి మహిళలు తెలిపిన వివరాలకు భార్య, భర్తలు ఇద్దరు బుక్ కీపర్ గా పనిచేస్తున్నారు. మొత్తం 32 పొదుపు గ్రూపులలో సుమారుగా కోటి రూపాయలు స్వాహా చేసారు. ఆస్తులు అమ్మి కొంత మేర అంటే 60 లక్షలు దాకా గ్రూపులో జమ చేసి కట్టారు. ఈ రోజు అధికారులు ఏసీ సార్, ఏపీఎం-ఏ.ఉమామహేశ్వరి, సీసీ లు, ఆడిటింగ్ టీమ్ విచ్చేసి 12 గ్రూప్ లు వెరిఫికేషన్ చెయ్యగా 6 గ్రూప్ లకు స్త్రీ నిధి లోన్స్, సీసీ లోన్స్ కానీ విచారించగా 11 లక్షలు రూపాయలు కట్టాలని లెక్కతేలిందన్నారు. ఈ లెక్కల వివరాలు అన్ని అందరి సమక్షంలో చదవగానే బుక్ కీపర్ భార్య, భర్త ఇద్దరు మేమే తీసుకున్నామని ఒప్పుకొని, ఒప్పందం పత్రం మీద సభ్యులు అందరు కలిసి సంతకం చేపిచ్చారు. బాధితులు కూలి,నాలీ పనులు చేసుకుంటూ బ్రతికే మా కొంపలు ముంచారని లబో దిబో అని వేడుకున్నారు.

# లక్ష పోస్టు కార్డుల ఉద్యమం ఉధృతం

**ప్రభుత్వాలకే స్ఫూర్తినిచ్చేలా ఆర్డీటీ సేవలు**

**ప్రజల జీవితాల్లో ఆర్డీటీ అనేది ఒక భాగం**

**ఏప్రిల్ 2 తర్వాత పరిపాలన స్తంభింపజేస్తాం**

**పార్లమెంట్ సమావేశాలు ముగిసేలోగా**

**ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయాలి**

**లేనిపక్షంలో కలిసొచ్చే పార్టీలు,**

**ప్రజాసంఘాలతో కలెక్టరేట్ దిగ్బంధం**

**వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత హెచ్చరిక**

**కుందుర్పిలో రంగయ్య ఆధ్వర్యంలో**

**లక్ష పోస్టు కార్డుల ఉద్యమం**







**కుందుర్పి సంక్షేమం, మార్చి 10,(రిపబ్లిక్ న్యూస్):** ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయని పక్షంలో పరిపాలన స్తంభింపజేస్తామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. ఏప్రిల్ 2వ తేదీ వరకు పార్లమెంట్ సమావేశాలు జరుగుతాయని, అప్పటిలోగా ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయాలన్నారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేస్తూ కళ్యాణదుర్గం వైసీపీ సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో మంగళవారం కుందుర్పిలో లక్ష పోస్టుకార్డుల ఉద్యమం ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, సమన్వయకర్తలు సాకే శైలజానాథ్, విశ్వేశ్వర్ రెడ్డి, జెడ్పి చైర్పర్సన్ బోయ గిరిజమ్మ, నియోజకవర్గ పరిశీలకులు మహేంద్రరెడ్డి, నాయకులు ఉమామహేశ్వరనాయుడు, తిప్పేస్వామి లు హాజరయ్యారు.

**గ్రామాల్లో అడుగుపెట్టలేని పరిస్థితిని తెచ్చుకోవద్దు**

ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ తొలుత అనంతపురం జిల్లాకు వచ్చినప్పుడు 'గో బ్యాక్ ఆర్డీటీ' అంటూ కొందరు వ్యతిరేకించారని, అప్పట్లో తన తండ్రి అనంత వెంకటరెడ్డి ఆర్డీటీకి అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. ఈ రోజు ఆర్డీటీపై మతం ముద్ర వేసి దేశంలోనే లేకుండా చేయాలన్న కుట్ర జరుగుతోందని ఆరోపించారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం ఆర్డీటీ సంస్థ అహర్నిశలు కృషి చేసిందన్నారు. దళిత, గిరిజనులకు విద్యను చేరువ చేసిందని తెలిపారు. భూగర్భ జలాలు పెంపొందించడం కోసం తొలుత చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టింది ఆర్డీటీ సంస్థేనని తెలియజేశారు.

**మానవత్వంతో పనిచేస్తున్న సంస్థకు అండగా ఉందాం**

ప్రభుత్వాలకు స్ఫూర్తినిచ్చేలా ఆర్డీటీ పని చేసిందని తెలిపారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ కోసం జిల్లాలో ఉద్యమాలు జరిగితే వాటిని కట్టడి చేసే ప్రయత్నాలను అధికార పార్టీ ప్రజాప్రతినిధులు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మానవత్వంతో పనిచేస్తున్న సంస్థకు అందరూ అండగా ఉండాలని, ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్దామని పిలుపునిచ్చారు. ప్రస్తుతం పార్లమెంట్



సమావేశాలు జరుగుతున్నాయని, ఏప్రిల్ 2వ తేదీలోగా ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో పరిపాలన స్తంభింపజేస్తామని.. ప్రజలు, కలిసొచ్చే పార్టీలు, ప్రజా సంఘాలతో కలిసి కలెక్టరేట్‌ను దిగ్బంధిస్తామని స్పష్టం చేశారు. ఆర్డీటీ విషయంలో ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. చివరకు గ్రామాల్లో అడుగుపెట్టలేని పరిస్థితిని తెచ్చుకోవద్దని తెలిపారు. ఆర్డీటీ పరిరక్షణ కోసం గతంలోనే బైక్ ర్యాలీ, పాదయాత్రలు చేశామని.. ఇప్పుడు ప్రధాని మోదీకి లక్ష పోస్టుకార్డులు పంపుతున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 2వ తేదీ వరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. మన జీవితాల్లో ఆర్డీటీ ఒక భాగమని, అలాంటి సంస్థను అందరూ కలిసికట్టుగా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

# సుంకం వేలం ను దక్కించుకున్న వేణు



**గుత్తి మార్చి 10( రిపబ్లిక్ న్యూస్ )** గుత్తి మున్సిపాలిటీలో మంగళవారం దినసరి, వారపు, జంతువధశాల సుంకం వసూలుకు బహిరంగ వేలం పాట మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియా మాట్లాడుతూ.. ఏడాది పాటు గుత్తి పట్టణంలో దినసరి,వారపు, జంతువధశాల నుంచి సుంకం వసూలుకు బహిరంగ వేలంపాట నిర్వహించామన్నారు. ఈ వేలం పాటలో బోయ వేణు అనే వేలం పాటదారుడు రూ.22,51,000కు బహిరంగ వేలం పాట పాడి సుంకం వసూలు చేసుకునే హక్కును దక్కించుకున్నారన్నారు. వీరికి నేటి నుంచి ఏడాది పాటు సుంకం వసూలు చేసుకునే హక్కు ఉంటుందని తెలిపారు.సుంకం వసూలుకు వేలంపాట ద్వారా మున్సిపాలిటీకి భారీ ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియా, రెవెన్యూ ఆఫీసర్ దశరథి, మున్సిపాలిటీ అధికారులు ఫయాజ్,మురళి, నాగార్జున, వేలంపాటదారులు బోయ వేణు, బోయ విజయలక్ష్మి,మున్సిపాలిటీ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# సావిత్రి బాయి పూలే 129 వ వర్ధంతి.




**గుత్తి మార్చి 10( రిపబ్లిక్ న్యూస్,)**గుత్తి పట్టణంలో ని పెన్షన ర్ల భవనంలో ప్రెసిడెంట్ అబూ బకర్,కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే 129వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో సావిత్రి బాయి పూలే చిత్ర పటానికి అసోసియేట్ ప్రెసిడెంట్ స్వర్ణాంబ, కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు పూల మాల వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ వీరు దేశంలోనే మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే అని ప్రచారం చేస్తున్నారు. బ్రిటిష్ వారికి నమ్మకంగా ఉంటూ దేశానికి వ్యతిరేకంగా పని చేస్తుఉన్న వాళ్లలో సావిత్రి బాయి పూలే ఒకరు.బ్రిటిష్ ప్రభుత్వం సావిత్రి బాయి పూలే కి ఉత్తమ ఉపాధ్యాయురాలు అని అవార్డ్ ఇచ్చారు అని కోశాధికారి జెన్నే కుల్లాయి బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ అబూబకర్, అసోసియేట్ ప్రెసిడెంట్ స్వర్ణాంబ, సెక్రెటరీ రామ్ మోహన్,కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు, ఫక్రుద్దీన్, విజయ లక్ష్మి,హర్షవదన, లక్ష్మి నారాయణ రెడ్డి, షైక్షా వలి,నారాయణ శెట్టి,దేవదాస్,చెన్నారెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

# 25 లక్షల దొంగతనం కేసులో ఇద్దరు నిందితులకు 2 సంవత్సరాల జైలు శిక్ష

**డోన్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు తీర్పు**

**కేసు విచారణలో కీలక పాత్ర పోషించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్, పోలీసులను అభినందించిన కర్నూలు ఎస్పీ**



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 10)** హైదరాబాద్ నుండి బెంగుళూరు వెళ్తున్న బస్సులో జరిగిన ₹25,00,000 (ఇరవై ఐదు లక్షల రూపాయల) దొంగతనం కేసులో ఇద్దరు నిందితులకు రెండు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ డోన్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ గౌరవ శ్రీమతి ఎస్. జ్యోతి తీర్పు వెలువరించారు.
ఈ ఘటనకు సంబంధించి తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రవీణ్ ఆర్. రావాల్ (52) ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు జిల్లా క్రిష్ణగిరి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. హైదరాబాద్ నుంచి బెంగుళూరు వెళ్తున్న బస్సులో 2025 అక్టోబర్ 25న దొంగతనం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం అమకతాడు టోల్ ప్లాజా వద్ద ఘటనకు సంబంధించిన ఆధారాలు గుర్తించబడ్డాయి.దర్యాప్తులో భాగంగా 2025 అక్టోబర్ 27న కర్నూలు జిల్లా కల్లూరు మండలం దిన్నెదేవరపాడు గ్రామం సమీపంలో దర్యాప్తు అధికారి, వెల్దుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. మధుసూదన్ రావు నేతృత్వంలో పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు.

**అరెస్టు అయిన నిందితులు:**

మహమ్మద్ షహీద్ (35) –బిజ్నోర్ జిల్లా, ఉత్తర్ ప్రదేశ్

సుహేబ్ (20) బిజ్నోర్ జిల్లా, ఉత్తర్ ప్రదేశ్

ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, కేసు విచారణ అనంతరం డోన్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు రెండు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చింది.
ఈ కేసులో నిందితులకు శిక్ష పడేలా సమర్థంగా వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ భాస్కర్ రావు, దర్యాప్తు అధికారి మరియు పోలీస్ సిబ్బందిని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఐపీఎస్ అభినందించారు.

# రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఆదర్శ విద్యా మందిర్ విద్యార్థి ఎంపిక

**నూజివీడులో జరిగే పోటీల్లో పాల్గొననున్న జి. రాకేష్ - పాఠశాల యాజమాన్యం అభినందనలు**




**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 10)** నూజివీడు లో ఈ నెల 11 నుండి 13వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఆదర్శ విద్యా మందిర్ హై స్కూల్‌కు చెందిన విద్యార్థి జి. రాకేష్ ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమని స్కూల్ కరస్పాండెంట్ బి. తిమ్మయ్య తెలిపారు.విద్యార్థి రాకేష్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాల ప్రతిష్టను పెంచే విషయమని ఆయన పేర్కొన్నారు. రాబోయే పోటీల్లో రాకేష్ మంచి ప్రతిభ కనబర్చి విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా రాకేష్‌కు స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ బి. రమ మాధవి, స్కూల్ డైరెక్టర్ బి. హరికిషన్, సుదర్శన్ మరియు విలువిద్య శిక్షకుడు ఎన్.వి. రాజు పాల్గొన్నారు.

# వైభవంగా ఖాద్రీ రథోత్సవం

**ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, కదిరి ఎమ్మెల్యే కందుకుంట - లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు**





**శ్రీ సత్యసాయి / కదిరి ఆధ్యాత్మికం, మార్చి 10,(రిపబ్లిక్ న్యూస్):** శ్రీ సత్యసాయి జిల్లా కదిరి ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో అత్యంత కీలక ఘట్టమైన రథోత్సవం (తేరు) మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకలో జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పాల్గొని, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల జయజయధ్వానాల మధ్య రథాన్ని ప్రారంభించారు. అంతకుముందు నృసింహ తేరు పల్లకిని సుగంధ పరిమళాలు వెదజల్లే విధంగా ప్రత్యేక పూల అలంకరణలు అరటి తోరణాలతో అలంకరించి, ప్రత్యేక గజమాలను స్వామివారికి వేసి గజారోహణపై తిరువీధుల్లో స్వామివారిని లక్షలాది భక్తులు ఊరేగించారు.రాష్ట్రం నలుమూలల నుంచే కాక పొరుగు రాష్ట్రాల నుండి కూడా లక్షలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారి రథోత్సవంలో పాల్గొని కనులకు భాగ్యం కలిగేలా తిలకించారు.

**భక్తులకు ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలు**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి జిల్లా సస్యశ్యామలం కావాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు.భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, చలువ పందళ్లు, వైద్య సదుపాయాలు, క్యూ లైన్లను కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించారు. తోపులాటలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు, ఉత్సవం ప్రశాంతంగా ముగిసేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆలయ అధికారులు మరియు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈనెల 14, 15వ తేదీలలో గుత్తి కోట ఉత్సవాల నిర్వహణ

**- : పెద్ద ఎత్తున ఉత్సవాలను నిర్వహించాలి**

**- : ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అన్ని ఏర్పాట్లు చేపట్టాలి**

**- : జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్**





**అనంతపురం, మార్చి 10 :( రిపబ్లిక్ న్యూస్)**

– ఈనెల 14, 15వ తేదీలలో గుత్తి కోట ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందని, ఉత్సవాలను పెద్దఎత్తున జయప్రదంగా నిర్వహించాలని, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో గుత్తి కోట ఉత్సవాలు - 2026పై సమన్వయ సమావేశాన్ని సంబంధిత శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ నిర్వహించారు.

– ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 14, 15వ తేదీలైన శనివారం, ఆదివారంలలో గుత్తి కోట ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించడం జరిగిందని, గుత్తిలోని ఫుట్బాల్ గ్రౌండ్లో రెండు రోజులు పాటు భారీ ఎత్తున ఉత్సవాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు సహకారం, సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. గుత్తి కోట ఉత్సవాల నిర్వహణ కోసం ఇన్ఫ్రాస్ట్రక్చర్ కమిటీ, ప్రోటోకాల్, రిసెప్షన్ అండ్ అకామిడేషన్ కమిటీ, పబ్లిసిటీ కమిటీ, స్టేజ్ కమిటీ, కల్చరల్ ప్రోగ్రామ్స్ కమిటీ, ఎగ్జిబిషన్ స్టాల్స్ కమిటీ, ఈవెంట్స్ కమిటీ, ఫోర్ట్ కమిటీ, ఫుడ్ కమిటీ, మెమెంటోస్ కమిటీ, శానిటేషన్ అండ్ డ్రింకింగ్ వాటర్ సప్లై కమిటీ, పబ్లిక్ మొబైలైజేషన్ కమిటీ, ట్రాన్స్పోర్టేషన్ కమిటీ, స్కూల్ కాంపిటీషన్స్ కమిటీ, సేఫ్టీ, సెక్యూరిటీ అండ్ పార్కింగ్ కమిటీ, మెడికల్ క్యాంపుల కమిటీ లాంటివి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉత్సవాలను ఆయా శాఖల జిల్లా అధికారులు బాధ్యతగా తీసుకొని పనిచేయాలని, ఆయా శాఖల పరిధిలో వివిధ కార్యక్రమాలను చేపట్టేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఖ్యాతి పెంపొందించేలా ఉత్సవాలు నిర్వహించాలన్నారు. మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, తాగునీరు ఏర్పాటు ఉండాలని, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని, రోడ్లు పరిశుభ్రంగా ఉంచడం, క్లీనింగ్ అండ్ శానిటేషన్ ఏర్పాటు, విస్తృతంగా ప్రచారం నిర్వహించడం చేయాలని, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ఆయా శాఖలో పరిధిలో స్టాల్స్ ఏర్పాటుచేయాలని, వివిఐపి, ప్రోటోకాల్ నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఉత్సవాల కోసం బందోబస్తు జాగ్రత్తగా చేయాలని, మెడికల్ క్యాంప్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గుత్తి కోట ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆదేశించారు.

– ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మలోల, జిల్లా టూరిజం అధికారి జయకుమార్ బాబు, గుంతకల్లు ఆర్డీవో ఆర్బిఎస్కే.శ్రీనివాస్, గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి ఎం.రవి, ఏపీఎమ్ఐపి పిడి రఘునాథరెడ్డి, చేనేత జౌళి శాఖ ఏడి వరప్రసాద్, మెప్మా పీడీ విశ్వజ్యోతి, ఐసిడిఎస్ పిడి శ్రీదేవి, డిఎల్డివో విజయలక్ష్మి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, ఎండోమెంట్ ఏసి మల్లికార్జున ప్రసాద్, ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా అధికారి శైలేంద్ర, ఆర్.అండ్.బి ఈఈ రాజగోపాల్, డిఎస్ఓ వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై డిఎం రమేష్ రెడ్డి, గుత్తి తహసిల్దార్ పుణ్యవతి, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, ఆయా శాఖల జిల్లా, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వన్య ప్రాణుల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు

### :- డి ఎఫ్ వో అనురాగ్ మీనా ఐఎఫ్ఎస్



**బండి ఆత్మకూరు, మార్చి 10, (రిపబ్లిక్ న్యూస్ ):-** నల్లమల అటవీ ప్రాంతంలోని వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు డిప్యూటీ డైరెక్టర్ టైగర్ ప్రాజెక్ట్ అనురాగ్ మీనా ఐఎఫ్ఎస్ తెలిపారు. మంగళవారం ఆయన బండి ఆత్మకూరు మండల అటవీ కార్యాలయ పరిధిలోని నారపురెడ్డి కుంట సెక్షన్ , నార్త్ బీట్ పంగోలియన్ బేస్ క్యాంపు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన కెమెరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. వేసవి కాలంలో వణ్యప్రాణుల త్రాగు నీటి అవసరాల కోసం చెక్ డ్యామ్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే నారపు రెడ్డి కుంట నార్త్, సౌత్ బీట్లలో నాలుగు చెక్ డ్యామ్ లు, 12 ,13 సాసర్ ఫీట్ లు నిర్మించినట్లు వివరించారు. వీటితో పాటు ఫైర్ ఫండ్స్ తవ్వినట్లు చెప్పారు. ప్రస్తుతం నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ లో పులుల లెక్కింపు కొనసాగుతున్నట్లు డిప్యూటీ డైరెక్టర్ వివరించారు. పులుల లెక్కింపు ప్రక్రియ ఈనెల 30కి పూర్తవుతుందన్నారు. గణాంకాల తర్వాత పులుల వివరాలు వెల్లడిస్తామన్నారు. రిజర్వు ఫారెస్ట్ లో 2024, 25 గణాంకాల ప్రకారం 87 పులులు ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. అటవీ సంరక్షణతో పాటు గిరిజనుల ఉపాధి కల్పన కోసం కూడా చర్యలు చేపట్టినట్లు డిఎఫ్ఓ వివరించారు. ప్రస్తుతం గిరిజనులకు మౌలిక వసతుల కల్పనలో భాగంగా నారపు రెడ్డి కుంట గూడెంలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసి గిరిజనులకు మినరల్ వాటర్ అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే అటవీ ప్రాంతంలోని జారుడు బండ పెద్దవాగు వద్ద చెక్ డ్యామ్ నిర్మించడం వల్ల నారపురెడ్డి కుంట చెరువుకు నీరు వచ్చే అవకాశం ఉన్నట్లు గుర్తించి వాటిని పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు ప్రసన్న, రాజేష్ తదితరులు ఉన్నారు.

# మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ దాడులు



తనిఖీలు నిర్వహిస్తున్న ఏ సి బి డి ఎస్ పి ప్రసాద్ రెడ్డి



టౌన్ ప్లానింగ్ సెక్షన్లో తనిఖీ చేస్తున్న సీఐ హమీద్ ఖాన్

**అనంతపురం క్రైమ్, మార్చి 10,(రిపబ్లిక్ న్యూస్):** అనంతపురం మున్సిపల్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మంగళవారం టౌన్ ప్లానింగ్ సెక్షన్ బిల్డింగ్ పర్మిషన్ లో అవకతవకలు జరిగాయా అన్నకోణంలో సోదాలు జరిపారు. టౌన్ ప్లానింగ్ సెక్షన్ లో ప్రతి ఫైల్ ని ఏసీబీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయం అవినీతి మొత్తం ఏసీబీ అధికారుల దృష్టిలో పడడం వల్ల ఫైళ్ల పరిశీలన ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది.

**బిల్డింగ్స్ అప్రూవర్స్ విషయంలో అవకతవకలు**

ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూఅనంతపురం మున్సిపల్ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగంపై ఫిర్యాదులు వచ్చాయని, ఫిర్యాదుల మేరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సెక్షన్ల విభాగంలో బిల్డింగ్స్ అప్రూవర్స్ కమర్షియల్ విషయంలో అవకతవకలు జరిగినట్లు తెలుస్తోందన్నారు.ప్లానింగ్ రూల్స్ ప్రకారం బిల్డింగ్స్ కట్టారా లేదా అన్నకోణంలో విచారణ చేస్తున్నట్లు, డాక్యుమెంట్స్ ప్రకారం బిల్డింగ్స్ కట్టారా లేదా అని రేపు ఫీల్డ్ విచారణ చేస్తామని, ఇంకా తనిఖీలు కొనసాగుతాయని అయితే లేటు కావచ్చన్నారు. వీటిపై పూర్తి ఆధారాలు వచ్చిన తర్వాత మీడియాకు వివరించడం జరుగుతుందన్నారు. చాలామంది ప్రభుత్వ ఉద్యోగులు వారు చేయదలచినటువంటి పనులకు ప్రజల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, వీటిపై ఫిర్యాదులు అందుతున్నాయని, డబ్బులు డిమాండ్ చేసినట్లు మీడియా వారి దృష్టికి వచ్చినట్లయితే ఏసీబీ అధికారులను సంప్రదించమని చెప్పాలన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 1064 కు ఫిర్యాదు చేసిన వాటిపై ఖచ్చితంగా చర్యలు చేపడతామన్నారు.ఏ సి బి. డి ఎస్ పి అనంతపురం ఫోన్ నెంబర్ 9440446181, ఇన్స్పెక్టర్ ఫోన్ నెంబర్ 9440446182 కు మెసేజ్ చేసినా కూడా చర్యలు తీసుకుంటామని ఏసీబీ డీఎస్పీ ప్రసాద్ రెడ్డి మీడియాకు వివరాలను వెల్లడించారు. సోదాల్లో ఏసీబీ డీఎస్పీ ప్రసాద్ రెడ్డి, సిఐ హమీద్ ఖాన్ పాల్గొన్నారు.

# స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ

**మంత్రికి గ్రామంలో స్వచ్ఛత కార్యక్రమాలు - వాలంటీర్లతో కలిసి డ్రైనేజీలు శుభ్రపరిచిన కృష్ణమ్మ**






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 10)** ఆదోని మండల పరిధిలోని మంత్రికి గ్రామంలో మంగళవారం "స్వచ్ఛ భారత్ స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమాన్ని కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి గుడిసె ఆది కృష్ణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. గుడిసె కృష్ణమ్మ సేవ సైన్యం వాలంటీర్లతో కలిసి గ్రామంలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు.


ఈ సందర్భంగా గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయం ముందు అలాగే ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న డ్రైనేజీలలో పేరుకుపోయిన పూడికను తొలగించి శుభ్రపరిచారు. అనంతరం గ్రామ ప్రధాన వీధుల్లో స్వయంగా చీపురు పట్టి పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుడిసె ఆది కృష్ణమ్మ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, రోగాలు దరిచేరవని తెలిపారు. గ్రామాల పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, స్వచ్ఛతను అలవాటుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమం సందర్భంగా గ్రామస్థులు తమ సమస్యలను జిల్లా అధ్యక్షురాలు దృష్టికి తీసుకువచ్చారు. ఇల్లు నిర్మించుకుంటున్నామని, బిల్లులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కొంతమంది కోరగా, ఇటీవల వలస వెళ్లి ప్రమాదానికి గురైన వ్యక్తికి పెన్షన్ మంజూరు చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన గుడిసె ఆది కృష్ణమ్మ వెంటనే పంచాయతీ కార్యదర్శికి సదరం సర్టిఫికేషన్ స్లాట్ బుక్ చేసి సంబంధిత ధ్రువపత్రం పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గుడిసె శ్రీరాములు, కొత్తూరు సర్పంచ్ నాగరాజ్, అంబేద్కర్ సొసైటీ చైర్మన్ జాలమంచి రంగస్వామి, మాజీ ఎంపీపీ మురళి, మాజీ సర్పంచ్ మాదవ్, బైచిగేరి ఓంకార్, గోపాల్, మంత్రికి ముని, వెంకటేష్, రామాంజిని, నాగేంద్ర, మహదేవ్, సాదిక్ వలి, రాఘవరెడ్డి, బల్లెకల్ బసవరాజ్, సవారయ్య, బంగారు బాబు, కాసిం, అశోక్, చిట్టి పెద్ద చిట్టి, చంద్ర, వీరేష్, విజయ్, భరత్, గంగాధర్, రంగస్వామి, తిమ్మప్ప, గిడ్డయ్య, దొడ్డిన గిరి, గజేంద్ర, ఆర్ఎంపి భాష, విద్య కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, ఈరన్న, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఎవరి పొలం నేను కబ్జా చేయలేదు

## చేసినట్టు నిరూపించండి -మాజీ మంత్రి బుగ్గన

**మా కుటుంబానికి పేదలకు సాయం చేసే వ్యక్తులమే కానీ ఎవరి పొలం కబ్జా చేయాల్సిన అవసరం నాకు లేదు**

**బేతంచెర్ల ప్రతినిధి, మార్చి 10,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)** ఆంధ్రప్రదేశ్ సీఎంచంద్రబాబు నాయుడునాకు ఉన్న అనుభవం ఎవ్వరికీ లేదని చంద్రబాబు నేడు పదేపద చెప్తుంటారు ప్రతి మీటింగ్ లోను. కానీ రెవెన్యూలో బేసిక్ నాలెడ్జ్ కూడా అతనికి లేదు,భూ వివాదాలకు సంబంధించి ఒక పద్ధతి ఉంటుంది.. 2002 నుంచి సమస్య అంటున్నాడు.. 50 సార్లు తిరిగినా పని జరగలేదని అంటున్నాడు. అంటే వ్యవస్థలో కాదు.. వ్యక్తిలో తప్పు ఉందని అర్థం కావడం లేదా, ఆఖరికి ఆర్డీవో కూడా అది అసైన్డ్ భూమి అని క్లియర్ కట్టుగాగ చెప్పాడు జరిగింది, అయినప్పటికీ కూడా ఈ వివాదాన్ని రాజకీయం చేయడానికి అతడినే బెదిరించాడు



బుగ్గన రాజేంద్రనాథ్ మాజీ మంత్రి మాట్లాడుతూ మా కుటుంబం గురించి ఒకసారి తెలుసుకొని మాట్లాడితే మీ వయసుకు మీ అనుభవానికి చాలా మంచిది, ఎవరో చెప్తే మీరు మా కుటుంబం గురించి తెలియక కబ్జా చేశారని అనడం వలన మీరు మీ పెద్దరికానికి మేమే వదిలేస్తున్నాను ఎందుకంటే మీరు పదేపదే నాకున్న అనుభవం ఎవరికి లేదంటూ చెప్తుంటారు కానీ మా కుటుంబం గురించి ఒకసారి విచారించండి ఏ పేద వాళ్ల దగ్గర మేము ఎప్పటికీ కూడా మేము అన్యాయం చేసినట్టు కబ్జా చేసినట్టు నిరూపించగలండి మేము ఎంతోమందికి సేవ చేసే వాళ్ళమే కానీ మా కుటుంబం గురించి తెలుసుకొని మాట్లాడితే మీ పెద్దదేగానికి మంచిది కొన్ని వందల మందికి సహాయం చేసే వాళ్ళమే కానీ పదిమంది సొమ్ము మేము దోచుకోవడం మా కుటుంబంలో ఎవరు కూడా లేదు అది ఒకసారి మీరు గాని మీ రాజకీయ నాయకులు గాని మీకు సంబంధించిన అధికారులకు గాని చెప్తున్నాను నిరూపిస్తే నేను దేనికైనా మీరు ఏది చెబితే అది చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను రాజకీయాల కోసం ఏదేదో మాట్లాడాడు మీరు పెద్దలు అది మీ విజ్ఞతకు వదిలేస్తున్నాను ఎందుకంటే చాలా క్లియర్ గా రైతు అడిగిన సమాధానానికి అక్కడికి వచ్చిన అధికారులు స్పష్టంగా చెబుతున్నారు అయినప్పటికీ కూడా మీరు దీని రాజకీయ రాజకీయం చేయాలని చూస్తున్నారు నేను కబ్జా చేసినట్టు ఎక్కడైనా నిరూపించగలండి దానికి నేను సమాధానం చెప్పడానికి ఎనీ టైం ఎక్కడైనా సరే నేను వచ్చి చెప్పడానికి సిద్ధంగా ఉన్నాను, దయచేసి ఎవరో చెప్పిన మాటలు విని మీరు పెద్దవాళ్లు మీరు ఒకసారి ఆలోచించవలసిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ని ఆలోచించవలసిందిగా తెలియజేయడం జరుగుతుంది. నా గురించి నా కుటుంబం గురించి మేము ఎంతోమంది పేదవాళ్లకు మేము కొన్ని వందల కోట్లు సహాయం చేసే వాళ్ళమే కానీ మేము ఒకరిని బాధ పెట్టి గాని వాళ్ళ పొలాలని లాక్కోవడం గాని అలాంటివి మా చరిత్రలు లేవు అది ఒక సారీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచించాలని తెలియజేస్తున్నాను, మీకు ఎవరో ఏదో చెబుతున్నారు, మీరు ఈ రాష్ట్ర సీనియర్ నాయకులు మరియు ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి మీరు ఆలోచించి మాట్లాడితే మీ పెద్ద తరానికి ఒక విలువ ఉంటుందని తెలియజేస్తున్నాను ఎందుకంటే మీరు ఎవరో చెప్తే మీరు మా కుటుంబం గురించి నింద వేయడం సరికాదని నేను తెలియ చేస్తున్నాను

# శ్రీ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవంలో అపశృతి

**తొక్కిసలాటలో ఐదుగురికి గాయాలు -జాగ్రత్తలు పాటించాలని పోలీసుల సూచన**




**శ్రీ సత్య సాయి క్రైమ్, మార్చి 10,(రిపబ్లిక్ న్యూస్):** శ్రీ సత్య సాయి జిల్లా కదిరిలో నిర్వహించిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవంలో అనుకోని అపశృతి చోటుచేసుకుంది. భారీ సంఖ్యలో భక్తులు రథోత్సవాన్ని దర్శించేందుకు తరలివచ్చిన సమయంలో రథం సమీపంలో ఒక్కసారిగా తొక్కిసలాట ఏర్పడింది. ఈ ఘటనలో ఐదుగురు భక్తులు రథం కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. అక్కడే ఉన్న స్థానికులు, అధికారులు వెంటనే స్పందించి గాయపడిన వారిని బయటకు తీసి చికిత్స కోసం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు వారికి చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని వైద్యులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

**ప్రజలు సంయమనంతో స్వామి వారి రథోత్సవం తిలకించాలి**

రథోత్సవం సందర్భంగా భారీగా జనసందోహం ఉండటంతో ఈ సంఘటన చోటుచేసుకున్నట్లు ప్రాథమిక సమాచారం వెల్లడైంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకుని భక్తులను క్రమపద్ధతిలో తరలించారు. సంఘటన స్థలంలో పోలీసులు,ప్రభుత్వ అధికారులు ప్రజలు సంయమనంతో స్వామి వారి రథోత్సవం తిలకించాలని భక్తులను కోరారు.

ఈ ఘటనపై స్పందించిన పోలీసులు,ఉత్సవాలు,



రథోత్సవాల సమయంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా రథానికి అత్యంత దగ్గరగా వెళ్లకుండా ఉండటం, పిల్లలు, వృద్ధులను జాగ్రత్తగా చూసు కోవడం,పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించడం ద్వారా ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.

భక్తులు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనేటప్పుడు భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని,తొక్కిసలాటకు దారి తీసే పరిస్థితులను నివారించేందుకు భక్తులు తమకు సహకరించాలని పోలీసులు కోరారు.

# డ్రా లో "రాయల్ ఎన్ఫీల్డ్ బైక్" గెలుపు

**లక్కీడ్రా కాంటెస్ట్ విజేతలకు బహుమతులు - మొదటి బహుమతికి రాయల్ ఎన్ఫీల్డ్ బైక్ అందజేత**

**అందజేసిన లాట్ మొబైల్స్ యాజమాన్యం -13 ఏళ్ల నమ్మకానికి లాట్ మొబైల్స్ స్టోర్స్ నిదర్శనం**

**అనంతపురం ప్రతినిధి, మార్చి 10,(రిపబ్లిక్ న్యూస్):** లక్కీ డ్రా లో ఓ కుటుంబానికి అదృష్టం వరించి రాయల్ ఎన్ఫీల్డ్ బైక్ ను సొంతం చేసుకునే విధంగా చేసింది. కష్టపడే తత్వం ఉన్నా కూడా కాస్తంత నుదుటున బ్రహ్మరాత ఉండాలి అని పెద్దలు చెప్పే సామెత గుర్తుకొస్తుంది. అందులో భాగంగానే లాట్ మొబైల్ స్టోర్స్ లలో లక్కీ డ్రా చేసిన కొందరిని విజేతలుగా నిలబెట్టింది.

**కూపన్లు పొందిన వారందరి కోసం లక్కీడ్రా కాంటెస్ట్**

నగరంలోని ప్రఖ్యాతిగాంచిన లాట్ మొబైల్స్ స్టోర్స్ లో లక్కీ డ్రా ద్వారా కాంటెస్ట్ విజేతలకు బహుమతుల్ని స్వయంగా లాట్ మొబైల్స్ యాజమాన్యం అందించారు. శనివారం అనంతపురం లో సుభాష్ రోడ్ , రాజు రోడ్ లో ఉన్న రెండు లాట్ మొబైల్స్ స్టోర్ లలో 2026 జనవరి 3 నుండి 31 వరకు స్టోర్లలో పరికరాలు కొనుగోలు చేయడం ద్వారా కూపన్లు పొందిన వారందరి కోసం లక్కీ డ్రా కాంటెస్ట్ ని ప్రవేశపెట్టారు. ఈ ప్రత్యేక సేవలు అనంతపురం పరికరాలు కొనుగోలు చేసిన వారి కోసమే రూపొందించామని లాట్ మొబైల్స్ డైరెక్టర్ ఎం. అఖిల్ ఓ ప్రకటనలో తెలిపారు.

**అందరి సమక్షంలోనే విజేతలని ప్రకటించడం మొబైల్ రిటైల్ చరిత్రలోనే ఒక సంచలనం**




ఈ సందర్భంగా డైరెక్టర్ ఎం. అఖిల్ మాట్లాడుతూ లాట్ కొనుగోలు దారులు చాలా చక్కగా లక్కీ డ్రా కాంటెస్ట్ ని వినియోగించుకున్నారన్నారు. లాట్ మొబైల్ స్టోర్స్ లో అధిక సంఖ్యలో పరికరాలు కొనుగోలు చేసిన వ్యక్తులు పాల్గొనడం ద్వారా మంచి స్పందన వచ్చిందన్నారు. పదమూడు ఏళ్లుగా పరికరాలు కొనుగోలు చేసిన వారికి ఎంతో నమ్మకంతో సేవలు అందిస్తున్న లాట్ మొబైల్స్ లక్కీ డ్రా విన్నర్స్ ని ఈ నెల ఫిబ్రవరి 7న శనివారం అనంతపురం సుభాష్ రోడ్ లో ఉన్న లాట్ మొబైల్స్ స్టోర్ లో అందరి సమక్షంలోనే విజేతలని ప్రకటించడంతో పాటు, లాట్ లక్కీ డ్రా విజేతలకు బహుమతులను అప్పటికప్పుడే స్వయంగా అందచేయడం మొబైల్ రిటైల్ చరిత్రలోనే ఒక సంచలనం అని పేర్కొన్నారు.

**లక్కీడ్రా లో గెలుపొందిన వారికి బహుమతులు**

మొదటి బహుమతి రాయల్ ఎన్ ఫీల్డ్ బైక్, ద్వితీయ బహుమతి రిఫ్రిజిరేటర్, తృతీయ బహుమతి వాషింగ్ మెషిన్, నాలుగవ బహుమతి గీజర్, అయిదవ బహుమతి సౌండ్ బార్ ఇయర్ బర్డ్స్, నెక్ బ్యాండ్ తదితరు వాటిని లక్కీ డ్రాలో విజేతలు గెలుచుకున్నారు. లక్కీ డ్రా లో గెలుపొందిన విజేతలు హర్షం వ్యక్తం చేశారు.

**కొనుగోలు చేసే వ్యక్తులకు అద్భుతమైన సేవలు**

అనంతరం లాట్ మొబైల్స్ డైరెక్టర్ ఎం. సుప్రజ పత్రికా విలేకరులతో మాట్లాడారు. అనంతపురం సుభాష్ రోడ్, రాజు రోడ్ లో ఉన్న రెండు లాట్ మొబైల్స్ స్టోర్స్ లలో 365 రోజులు ఎక్సక్లూసివ్ స్పెషల్ ఆఫర్స్ ఉండేలా, పరికరాలు కొనుగోలుదారులకు మంచి షాపింగ్ ఎక్స్పిరియన్స్, పరికరాలు కొనుగోలు చేసే వ్యక్తులకు అద్భుతమైన సేవలు ఎప్పుడూ ఉండేలా లాట్ యాజమాన్యం బాధ్యత తీసుకుంటుంది అని చెప్పారు. ఇలాంటి వేడుకలు ఇంకా మరెన్నో జరుపుకుందాం అని, ఈ వేడుకలో అందరూ భాగస్వామ్యం అయినందుకు లాట్ యాజమాన్యం ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. లక్కీ డ్రాలో గెలుపొందిన విజేతలు ఆనందంలో మునిగి తేలుతున్నారు. లాట్ మొబైల్ స్టోర్స్ లలో ఈ వేడుకలు ఉత్సాహంగా ఉల్లాసంగా జరిగాయి. లాట్ యాజమాన్యం ఈ సంతోషభరితమైన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంతో పరికరాల కొనుగోలుదారులకు మరింత ఉత్సాహాన్ని కలగజేసింది.

# నైపుణ్యాన్ని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలి

## వక్ఫ్ ఆస్తులను సద్వినియోగం చేసుకోవాలి -న్యాయశాఖ మరియు మైనారిటీ వెల్ఫేర్ శాఖ మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్

## అన్ని వర్గాల వారిని అభివృద్ధిలోకి తీసుకొని వస్తున్నాం... -పరిశ్రమలు , వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్

**కర్నూలు /నంద్యాల ఫిబ్రవరి 10( రిపబ్లిక్ న్యూస్) :**
వృత్తి నైపుణ్యాన్ని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని,వక్ఫ్ ఆస్తులను సద్వినియోగం చేసుకోవాలని, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా లబ్ధి పొందాలని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ అన్నారు.మంగళవారం కర్నూలులో ఉస్మానియా కాలేజీ దగ్గర టీ జి వెంకటేష్ షాది ఖానా హాల్లో జరిగిన కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం సందర్భంగా న్యాయశాఖ మరియు మైనారిటీ వెల్ఫేర్ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ మాట్లాడుతూ... వక్ఫ్ బోర్డ్ దగ్గర ఖరీదైన భూములు ఉన్నాయని పట్టింపులకు తగాదాలకు పోకుండా వాటిని సద్వినియోగం చేసుకొని ముస్లిం మైనారిటీలు లబ్ధి పొందాలని కోరారు. గతంలో కర్నూలు జిల్లాకు నేను మంత్రి గా ఉన్నప్పుడు కేఈ కృష్ణమూర్తి కూడా మంత్రిగా ఉన్నారు అయ్యపు రెడ్డి పార్లమెంటు సభ్యులుగా ఉన్నారు. ఆ సమయంలో ఈద్ గా కు 10 ఎకరాల స్థలాన్ని కేటాయించాము , హాజీరా ఉమెన్స్ కాలేజ్ ను ఏర్పాటు చేశాం , ఆంధ్ర ప్రదేశ్ లో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేశాం , హైదరాబాద్ లో ఉర్దూ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం , మఖాన్ - దుకాణ్ స్కీమ్ తీసుకుని వచ్చాం, కర్నూలుకు ఉర్దూ అకాడమీ ని తీసుకుని వచ్చాం , ముత్తవల్లిలకు , మౌజర్లకు గౌరవ వేతనం ఇస్తున్నామని , గతం లో కార్పొరేషన్ ద్వారా లక్షల్లో లోన్లు ఇప్పించాం గత ఐదు సంవత్సరాలు మాత్రం ఏమీ జరగలేదు అని తెలిపారు. ఇప్పుడు మళ్లీ కార్పొరేషన్ ద్వారా లోన్లు ఇప్పించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్కిల్ కాంప్లెక్స్ కట్టాం కంప్యూటర్లు ఏర్పాటు చేశాం డెవలప్మెంట్ కు ప్రోత్సహిస్తున్నాము అని మీకున్న నైపుణ్యాన్ని ఇంకా మెరుగుపరచుకొని అభివృద్ధిలోకి రావాలని తెలిపారు .





ఇపుడు మీకు కార్పోరేషన్ అందిస్తున్న 141 ( ఒకటి రూ6,400/- లు) కుట్టు మిషన్లతో మీ కుటుంబాలను వృద్ధి లోకి తీసుకొని రావాలని , కొత్తగా ఆలోచించి నైపుణ్యం పెంచుకొని మంచి పనులు చేసి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని మహిళలను కోరారు. మీ నైపుణ్యాలను ఇంకా పెంచుకోవాలని మీ పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాలని వారిని కోరారు.

ఈ సందర్భంగా పరిశ్రమలు , వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి జి భరత్ మాట్లాడుతూ... జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో వక్ఫ్ కమిటీ ఏర్పాటు చేయకుండా ఉండిపోయారని దానివల్ల ముస్లిం మైనారిటీలకు నష్టం జరిగిందని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 141 ( ఒకటి రూ6,400/- లు ) ఉషా కంపెనీ బ్రాండెడ్ కుట్టు మిషన్ల పంపిణీ లాంటి అభివృద్ధి పనులు జరుగుతున్నవి అని మంత్రి తెలిపారు. ఈ మిషన్లను సద్వినియోగం చేసుకొని ముస్లిం సోదరీమణులు అభివృద్ధిలోకి రావాలని మంత్రి ఆకాంక్షించారు. కర్నూలులో ఉర్దూ యూనివర్సిటీ పనులు పూర్తి చేయటానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని మా సొంత నిధులు కేటాయించి కూడా పనులు చేస్తున్నామని , కర్నూలు ఎగ్జిబిషన్ సొసైటీ మరియు కిడ్స్ వరల్డ్ పార్క్ ద్వారా వచ్చే దాదాపు 50 లక్షల రూపాయల ఆదాయాన్ని ముస్లిం మైనారిటీల కొరకు ఖర్చు చేస్తున్నామని మంత్రి తెలిపారు. స్థానిక బుధవారిపేటలోని దాదాపు 5 ఎకరాల స్థలాన్ని ఎం ఎస్ ఎం ఈ కి కేటాయించినట్లయితే అక్కడ చిన్న చిన్న పరిశ్రమలు నెలకొల్పి మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించగలమని దీనివల్ల వక్ఫ్ బోర్డు కూడా ఆదాయం వస్తుందని , ఈ సమస్యపై సరైన చర్యలు తీసుకోవలసిందిగా మంత్రి ఫరూక్ ను కోరారు. కర్నూలు అసెంబ్లీ పరిధిలో ఏవైనా మసీదు కమిటీలు , షాదీ ఖానా కమిటీలు , కాంప్లెక్స్ కమిటీలు సరిగా పని చేయకపోయినా నిస్తేజంగా ఉన్న వివరాలు తెలిపినట్లైతే వాటిని సరైన దారిలో పెట్టి ముస్లిం మైనారిటీలకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటానని మంత్రి తెలిపారు. మా తండ్రిగారు కట్టించిన ఈ టీజీవి షాదీఖానా ను నాలుగు సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉంచారని మేము అన్ని మతాలను , అన్ని వర్గాలను సమదృష్టితో చూస్తామని , ఆదరిస్తామని , గౌరవిస్తామని అందుకే అందరికీ అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందిస్తున్నామని , కావున మమ్మల్ని ఆదరించాలని మాకు అండగా ఉండాలని ఈ సమావేశంలో కోరారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ మాట్లాడుతూ... కొత్తగా వస్తున్న విద్యా విధానాన్ని , విద్యను ముస్లింలు అభ్యసించాలని అప్పుడే వారి అభివృద్ధి సాధ్యమని , ముస్లింల అభివృద్దే దేశాభివృద్ధి అని తెలిపారు. గత 20 సంవత్సరాల నుండి చాలా అభివృద్ధి జరుగుతూ ఉన్నదని దాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు. దాదాపు 3 లక్షల మంది కర్నూలు జిల్లాలో ముస్లింలు ఉన్నారని ప్రతి ఒక్కరూ మంచి విద్యను అభ్యసించి అభివృద్ధిలోకి రావాలని , నర్సింగ్ కోర్సులలో ఉద్యోగ అవకాశాలు చాలా ఉన్నాయని వాటిని అందిపుచ్చుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆకాంక్షించారు.ఈ సమావేశానికి క్రిస్టియన్ కార్పొరేషన్ ఎం.డి ఏ.శేఖర్ , జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ సబిహ పర్వీన్ , హజ్ కమిటీ మెంబర్ మన్సూర్ అలీ ఖాన్ , మైనారిటీ నాయకులు మహమ్మద్ ఖాన్ , మహబూబ్ ఖాన్ , జియావుల్ హక్ , జుబేర్ , సల్మాన్ , ఇమ్రాన్ , ఇన్చార్జులు వెంకటేష్ ,శుక్రన్ లు పాల్గొన్నారు.

# బరకాల కాలనీలో బోనాల పండుగ వైభవం

## తలపై బోనాలు ఎత్తుకొని నైవేద్యం సమర్పించిన భక్తులు



**బండి ఆత్మకూరు, మార్చి 10, (రిపబ్లిక్ న్యూస్ ):-** మండల పరిధిలోని చిన్నదేవలాపురం మజర గ్రామమైన బరకాల కాలనీలో బోనాల పండుగ అత్యంత వైభవంగా జరిగింది. మంగళవారం శ్రీ సుంకుల పరమేశ్వరి దేవి ఆలయ కమిటీ సభ్యులు ధూపం జంబులయ్య, సితారి మస్తాన్, సిరివాటి సుంకన్న, కోడిగింటి పెద్ద సుబ్బన్న, బేడ బుడగ జంగాల రాష్ట్ర నాయకులు తాటికొండ బుగ్గ రాముడు, చిత్తారి ఈశ్వరయ్య, మోతే నాగరాజుల ఆధ్వర్యంలో కాలనీలోని బేడ బుడగజంగాలు శ్రీ సుంకుల పరమేశ్వరీ దేవి అమ్మవారి బోనాల జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మేళ, తాళాలు మంగళ వాయిద్యాల మధ్య మహిళలు తలపై బోనాలు ఎత్తుకొని అమ్మవారికి కాయా, కర్పూరాలతో పాటు నైవేద్యం సమర్పించి వారి మొక్కులు చెల్లించుకున్నారు. ఇంటి ఇలవేల్పుగా భావించే శ్రీ సూక్తులు పరమేశ్వరి దేవి అమ్మవారి జాతర మహోత్సవ వేడుకల్లో చిన్న, పెద్ద తేడా లేకుండా కాలనీవాసులందరూ పాల్గొని డప్పుల ముందు చిందులు వేస్తూ ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. ప్రతి యేటా బేడ బుడగజంగాలు అమ్మవారి జాతర మహోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా బరకాల కాలనీ బంధు మిత్రులతో కలకలలాడింది. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.





# భవిష్యత్తు ఆరోగ్యానికి భద్రత

## - గర్భాశయ క్యాన్సర్ నివారణ టీకాలు





### జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా

**నంద్యాల, బ్యూరో మార్చి 10( రిపబ్లిక్ న్యూస్):**
9 నుండి 14 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలకు టీకా వేయించడం ద్వారా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను పూర్తిగా నివారించవచ్చని జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి గణియా తెలిపారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని గాంధీనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలకు చిన్న వయస్సులోనే టీకా వేయించడం ద్వారా భవిష్యత్తులో వచ్చే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ప్రమాదాన్ని పూర్తిగా నివారించవచ్చన్నారు. అందువల్ల 9 నుండి 14 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలందరికీ ఈ టీకా తప్పనిసరిగా అందేలా ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయంపై తల్లిదండ్రులకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మానవ శరీరానికి సహజసిద్ధంగా ఉండే వ్యాధి నిరోధక శక్తి గురించి వివరించిన కలెక్టర్, పుట్టినప్పటి నుంచి తల్లి పాల ద్వారా లభించే సహజ రోగనిరోధక శక్తి తో పాటు, టీకాల ద్వారా ఏర్పడే సంపాదిత రోగనిరోధక శక్తి ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. చిన్నతనం నుంచే ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంల ల ద్వారా అందించే టీకాలను సకాలంలో వేయించుకోవడం వల్ల భవిష్యత్తులో అనేక వ్యాధులను నివారించవచ్చన్నారు. జలుబు, దగ్గు వంటి అంటువ్యాధులతో పాటు మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్, కిడ్నీ సమస్యల వంటి దీర్ఘకాలిక వ్యాధుల పట్ల కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎ నుసి డి 4.0 సర్వే ద్వారా ప్రతి ఇంటి ఆరోగ్య వివరాలను సేకరించి ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకునే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధుల గుర్తింపుకు సంబంధించి నిర్వహిస్తున్న ఎన్ సి డి 4.0 సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. సచివాలయం పరిధిలోని ప్రతి కుటుంబానికి సంబంధించిన ఆరోగ్య సమాచారం ఏఎన్ఎంల వద్ద అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతున్నా లేదా బయట నగరాల్లో చికిత్స పొందుతున్నా వారి వివరాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, మందులు ప్రతి రోగికి అందుతున్నాయో లేదో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. సేకరించిన ఆరోగ్య వివరాలను వెంటనే ఆన్లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. వ్యాధులు సోకిన తర్వాత చికిత్స చేయడం కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత ముఖ్యమని కలెక్టర్ తెలిపారు. చిన్నతనం నుంచే పిల్లలకు అవసరమైన అన్ని రకాల టీకాలను సకాలంలో వేయించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ లక్ష్య సాధనలో క్షేత్రస్థాయి ఆరోగ్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డా. వెంకటరమణ, డిసిహెచ్ఎస్ డా. శ్రీదేవి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. సుదర్శన్, ఇతర వైద్యాధికారులు, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# బ్యాంకర్లు విరివిగా రుణాలు మంజూరు చేయాలి

## వ్యవసాయం, ఎంఎస్ఎంఈ, పాడి పరిశ్రమలకు ప్రాధాన్యత ఇవ్వాలి - జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 10)**
జిల్లాలో అభివృద్ధికి దోహదపడే విధంగా బ్యాంకర్లు విరివిగా రుణాలు మంజూరు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ బ్యాంకర్లను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ (డిసిసి) సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి క్రాప్ లోన్స్, అగ్రికల్చర్ టర్మ్ లోన్స్ మంజూరులో బ్యాంకులు మంచి పురోగతి సాధించాయని తెలిపారు. అయితే అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు సంబంధించి కేవలం 27 శాతం మాత్రమే రుణాలు మంజూరు చేయడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో వ్యవసాయ పరికరాలు అవసరమైన రైతులను గుర్తించి వారికి రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రెన్యూవబుల్ ఎనర్జీ రంగానికి సంబంధించి కేవలం 22 శాతం మాత్రమే రుణాలు మంజూరు చేయడం జరిగిందని, ఈ రంగాన్ని ప్రోత్సహించే విధంగా బ్యాంకులు ముందుకు రావాలని అన్నారు. ఎంఎస్ఎంఈలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, అయితే ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, ధనలక్ష్మి బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్ నిర్దేశించిన లక్ష్యాల సాధనలో వెనుకబడి ఉన్నాయని పేర్కొన్నారు. లక్ష్యాలను పూర్తి చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత బ్యాంక్ అధికారులను ఆదేశించారు.

జిల్లా అభివృద్ధిలో పాడి పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. పశుసంవర్ధక శాఖ మరియు డీఆర్డీఏ అధికారులు సమన్వయంతో పని చేసి స్వయం సహాయక సంఘాల మహిళలను ప్రోత్సహిస్తూ పాడి, గొర్రెల పెంపకం, కోళ్ల పెంపకం వంటి జీవనోపాధి కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. వీటికి అవసరమైన రుణాలను బ్యాంకులు ప్రాధాన్యతతో మంజూరు చేయాలని అన్నారు.

కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయడంలో బ్యాంకులు వెనుకబడి ఉన్నాయని పేర్కొంటూ ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అలాగే (పిఎం ఇ జి పి) కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. (పిఎం ఎఫ్ ఎం ఇ) పథకం కింద జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.చేనేత కార్మికులకు ఇచ్చే ముద్ర రుణాలను మరింత పెంచాలని, విద్యా రుణాల విషయంలో బ్యాంకులు తమ పనితీరును మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పీఎం సూర్యఘర్ పథకం కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు కూడా త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలని సూచించారు. వివిధ శాఖల ద్వారా సమర్పించిన డెఫ్ అకౌంట్లను యాక్టివేట్ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్న బ్యాంక్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.ఈ సమావేశంలో ఎల్‌డీఎం రామచంద్రరావు, ఆర్బీఐ లీడ్ బ్యాంక్ ఆఫీసర్ రామకృష్ణ, నాబార్డ్ డీడీఎం సుబ్బారెడ్డి, కెనరా బ్యాంక్ డివిజనల్ మేనేజర్ గౌతమ్, సీబీఆర్ ఎస్ఈటీఐ డైరెక్టర్ పుష్ప కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, పశుసంవర్ధక శాఖ అధికారి హేమంత్ కుమార్, దళిత ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కోఆర్డినేటర్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు






printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com